# తెలంగాణ కానుక

www.telanganakanuka.com RNI NO:TELTEL/2023/85625 తెలుగు దినపత్రిక

హైదరాబాద్ - రంగారెడ్డి | మంగళవారం 21 జూలై 2026 | సంపుటి : 4 | సంచిక : 102 | పేజీలు : 8 | వెల : రూ.4



## విలేకరులు కావలెను

జర్నలిజంపై ఆసక్తి ఉన్నవారికి సువర్ణ అవకాశం..
కలం కంటే శక్తివంతమైన ఆయుధం లేదు.... రండి
మాతో కలిసి నిజాన్ని ప్రజలకు చేరవేరుద్దాం..... తెలంగాణ
కానుక తెలుగు దినపత్రికకు జిల్లా మండలాల వారిగా
రిపోర్టర్లు కావలెను అనుభవం గల వారికి ప్రాధాన్యం

80088 87362


# ఎల్ నినోను ఎదుర్కొంటాం




- రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటాం
- ఎల్ నినో ప్రభావం వల్ల రాబోయే రోజుల్లో ప్రజలకు ఎలాంటి తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలి
- ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోంది
- ఎలాంటి ప్రకృతి విపత్తులనైనా సమర్థవంతంగా ఎదుర్కొని ప్రజలను ఆదుకుంటాం
- మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి



## అంతరిక్ష రంగంలో యువత అద్భుతాలు

- వర్షాలు బాగుండాలి
- వర్షాకాల సమావేశాలూ బాగుండాలి
- రెండూ బాగుంటేనే దేశం సుభిక్షంగా ఉంటుంది
- పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ప్రారంభంలో మోదీ పిలుపు
- "దేశ పురోగతిలో యువత పాత్ర అత్యంత కీలకం
- వారి సామర్థ్యాలు, ఆకాంక్షలు అంతరిక్షమంత విశాలమైనవి.
- 56 ఏళ్ల యువకుని గురించి మాట్లాడట్లేదు
- రాహుల్‌కు మోదీ చురక

# తెలంగాణలో భూసేకరణకు ప్రత్యేక చట్టం

- వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు!
- రాష్ట్రవ్యాప్తంగా ల్యాండ్ పూలింగ్ చట్టానికి ప్రభుత్వం కసరత్తు
- భూమి కోల్పోయే రైతులకు అభివృద్ధి చేసిన స్థలాలు
- ముసాయిదా బిల్లుకు తుది రూపు



హైదరాబాద్

తెలంగాణలో భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులకు భూసేకరణలో ఎదురవుతున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ల్యాండ్ పూలింగ్ విధానాన్ని తీసుకొచ్చేందుకు అధికార యంత్రాంగం వేగంగా కసరత్తు ప్రారంభించింది. తెలంగాణ కాంప్రహెన్సివ్ ఏరియా డెవలప్‌మెంట్ ప్లానింగ్ బిల్లు-2026 ప్రాథమిక ముసాయిదా సిద్ధమైనట్లు విశ్వసనీయ సమాచారం. ఈ బిల్లులో ఏమేం అంశాలు ఉండాలో సీఎస్ సంజయ్‌జాజు పురపాలక, రోడ్లు-భవనాలు, ఇరిగేషన్, రవాణా తదితర శాఖలు, హెచ్ఎండీఏ ఉన్నతాధికారులతో గురు, శుక్రవారాల్లో సెక్రెటరియట్‌లో చర్చలు చేశారు. ఈ ముసాయిదా బిల్లుకు తుది రూపు ఇచ్చేందుకు అధికారుల కసరత్తు - మిగతా3లో



## తొలి రోజే దుమారం

- నీట్, అయోధ్యలో విరాళాల చోరీ, విద్యార్థుల నిరసనలపై పార్లమెంట్‌లో ప్రతిపక్షాల ఆందోళనలు
- పలుమార్లు వాయిదాపడిన ఉభయ సభలు
- 'ఇండియా'కూటమి నేతల ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో ఉభయసభలు హోరెత్తిపోయాయి
- తామిచ్చిన వాయిదా తీర్మానాలపై చర్చ కు విపక్షాలు పట్టుబట్టాయి

# క్యూఆర్ కోడ్‌తో స్మార్ట్ రేషన్

- 3 నెలల బియ్యం ఒకేసారి పంపిణీ
- వారం రోజుల్లో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా కార్డుల పంపిణీ కార్యక్రమం
- క్యూఆర్ కోడ్‌తో పటిష్ఠ భద్రతా ఫీచర్లతో కొత్త కార్డుల రూపకల్పన
- ఆగస్టు నుంచి మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ
- రేషన్ సరుకులకు జులై 31 లోగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవడం తప్పనిసరి




హైదరాబాద్

తెలంగాణలో అర్హులైన పేదలకు కొత్త రేషన్ కార్డులు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ప్రస్తుతం వినియోగిస్తున్న కాగితపు కార్డుల స్థానంలో అత్యాధునిక టెక్నాలజీతో కూడిన ప్లాస్టిక్ స్మార్ట్ కార్డులను పంపిణీ చేయనుంది. వారం రోజుల్లోనే ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి ప్రారంభించేందుకు పౌరసరఫరాల శాఖ ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. హైదరాబాద్‌లో జరిగే ప్రధాన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పీవీసీ స్మార్ట్ కార్డుల రూపంలో రేషన్ కార్డులు ఇవ్వడం ఇదే తొలిసారి. ప్రస్తుతం - మిగతా3లో



## ఆపదలో అండగా... ఆర్టీసీ ఒకే కుటుంబం!

- కార్మికుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది
- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- దివంగత డ్రైవర్ కోలా శంకర్ కుటుంబానికి రూ. 90.85 లక్షల ఆర్థిక సాయం అందించిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.
- గత ప్రభుత్వాల కాలంలో ఆర్టీసీ కార్మిక సంఘాలను ఎత్తివేసి, నిరంకుశంగా వ్యవహరించారు

హైదరాబాద్

టీజీఎస్ ఆర్టీసీ కేవలం ఒక రవాణా సంస్థ మాత్రమే కాదని... వేలది మంది ఉద్యోగుల ఉమ్మడి కుటుంబమని రాష్ట రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. నర్సంపేట ఆర్టీసీ డిపోకు చెందిన దివంగత డ్రైవర్ కోలా శంకర్ కుటుంబానికి ఆర్టీసీ ఉద్యోగులు 'చేయూత' కార్యక్రమం ద్వారా - మిగతా3లో




## కోరలు చాస్తున్న పేదరికం

- పాకిస్థాన్‌ను చుట్టుముట్టిన ఆర్థిక సంక్షోభం..
- పాకిస్థాన్‌లో ప్రమాదకర స్థాయికి చేరిన పేదరికం
- గడిచిన ఆరేళ్లలో 21.8శాతం నుంచి 28.9శాతానికి పెరిగిన వైనం
- పట్టణాలతో పోలిస్తే గ్రామాల్లోనే ఎక్కువ ప్రభావం

# 'అపార్' తల్లిదండ్రుల ఇష్టం

- సమ్మతి పత్రంలో ఆప్ట్-అవుట్ ఆప్షన్ ఉండాల్సిందే
- ఆ మేరకు సవరణలు చేపట్టాలి
- సీబీఎస్ఈకి ఆదేశాలు జారీ చేస్తామన్న సుప్రీంకోర్టు
- దేశవ్యాప్తంగా ఒడిశా హైకోర్టు తీర్పు అమలుకు నిర్ణయం





## డిమాండ్లు నెరవేరే వరకు ఆందోళనలు కొనసాగుతాయి

- కేంద్రమంత్రి జేపీ నడ్డాతో కాక్రోచ్ జనతా పార్టీ నాయకుల భేటీ

# ‘అపార్’ తల్లిదండ్రుల ఇష్టం

**న్యూఢిల్లీ:** పాఠశాల విద్యార్థుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ‘అపార్’(ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) ఐడీల నమోదుపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ పథకానికి సమ్మతిని నిరాకరించేందుకు, తప్పుకునేందుకు తల్లిదండ్రులకు అవకాశం కల్పించేలా సవరణలు చేపట్టాలంది. ఈ మేరకు సెంట్రల్ బోర్డ్ అఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ)కి మార్గదర్శకాలు జారీ చేస్తామంది. నూతన విద్యా విధానం--2020 ప్రకారం కేంద్రం ప్రారంభించిన అపార్ పథకం కింద విద్యార్థుల కోసం ఒక ప్రత్యేకమైన, జీవితకాల 12--అంకెల ’స్టూడెంట్ ఐడీ’ రూపొందిస్తారు. ఇది విద్యార్థుల అన్ని విద్యాపరమైన రికార్డులకు ఒక డిజిటల్ పాస్‌పోర్ట్‌లా పనిచేస్తుంది. ఇందులో మార్కుల జాబితాలు, డిగ్రీ సరి?టఫికెట్లు, ఇతర విజయాల వివరాలన్నీ నిక్షిప్తమై ఉంటాయి.




**బలవంతం, రాజ్యాంగ విరుద్ధం...**

అపార్ ఐడీల నమోదు స్వచ్ఛందమేనని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, ఆచరణలో దీనిని ఆధార్‌తో అనుసంధానించి విద్యార్థులను బలవంతం చేస్తున్నారంటూ దాఖలైన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ వాదనలు వినిపిస్తూ.. బోర్డు పరీక్షలు రాసే విద్యార్థులకు అపార్ ఐడీని తప్పనిసరి చేస్తున్నారని తెలిపారు. పరోక్షంగా విద్యార్థులను ఆధార్ కోసం బలవంత పెడుతున్నారన్నారు. కేవలం ఆధార్, అపార్ ఐడీలు లేవన్న కారణంతో విద్యార్థులను పరీక్షలకు అనుమతించకపోవడం విద్యాహక్కు చట్టానికి, రాజ్యాంగానికి విరుద్ధమని వాదించారు. డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ చట్టం--2023 నిబంధనల ఉల్లంఘన జరుగుతోందని తెలిపారు.

**కేంద్రం కూడా అభ్యంతరం తెలపలేదు.**

అపార్ సమ్మతి పత్రంలో ‘ఆప్ట్ --అవుట్’ఆప్షన్ స్పష్టంగా ఉండాలంటూ ఒడిశా హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును ధర్మాసనం ఈ సందర్భంగా సమరి?థంచింది. ఆ తీర్పుపై కేంద్ర ప్రభుత్వం కూడా అభ్యంతరం తెలపలేదని గుర్తు చేసింది. అదే తీర్పును దేశవ్యాప్తంగా అమలు చేసేలా సీబీఎస్ఈకి మార్గదర్శకాలు జారీ చేస్తామని తెలిపింది. డేటా ప్రొటెక్షన్, సమ్మతి వంటి అంశాలపై అభ్యంతరాలను కూడా పరిశీలించాలని కోరుతామంది. ఈ పథకం పూర్తిగా స్వచ్ఛందంగానే ఉండాలని, సమ్మతి పత్రాల్లో తల్లిదండ్రులకు తిరస్కరించే అవకాశాన్ని తప్పనిసరిగా కల్పించాలని తేల్చిచెప్పింది. విద్యార్థుల డేటా గోప్యత, తదితర అభ్యంతరాలపై సమగ్ర పరిశీలన జరపాలని సీబీఎస్ఈని ఆదేశిస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది.

**ప్రతి దాన్నీ అనుమానించొద్దు...**

దేశంలో జరిగే ప్రతీ పరిణామాన్ని అనుమానపు దృష్టితో చూడొద్దని సుప్రీంకోర్టు హితవు పలికింది. విద్యార్థుల విద్యా ప్రణాళిక, రికార్డుల నిర్వహణ కోసం ఒకే విశిష్ట గుర్తింపు తీసుకురావడం మంచి పరిణామమేనని, దీనిని స్వాగతించాలని అభిప్రాయపడింది. దేశంలో డేటా భద్రతా చట్టం అమలులో ఉందని, ఎవరూ దానిని ఉల్లంఘించడానికి వీల్లేదని వ్యాఖ్యానించింది. అయితే, సేకరించిన విద్యార్థుల డేటాను ఏ ఉద్దేశం కోసం తీసుకున్నారో, ఆ విద్యా సంబంధిత అవసరాలకు మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేసింది.

# తొలి రోజే దుమారం

**న్యూఢిల్లీ:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలి రోజు సమావేశాలు విపక్షాల నినాదాల హోరులో కొట్టుకుపోయాయి. ఎలాంటి చర్చలు జరగకుండానే లోక్‌సభ, రాజ్యసభలు సోమవారం అర్ధ?ధంతరంగా ముగిసి మంగళవారానికి వాయిదాపడ్డాయి. ప్రతిష్టాత్మక నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ, అయోధ్య రామ మందిరంలో కోట్ల రూపాయల విరాళాల చోరీ, జంతర్‌మంతర్ వద్ద విద్యార్థులపై లాఠీచార్జ్ తదితర కీలకాంశాలపై చర్చ చేపట్టాలంటూ విపక్ష పార్టీల నేతలు పట్టుబట్టడంతో పార్లమెంట్ ఉభయసభల్లో తొలిరోజే ప్రతిష్టంభన నెలకొంది. ‘ఇండియా’కూటమి నేతల ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో ఉభయసభలు హోరెత్తిపోయాయి. తామిచ్చిన వాయిదా తీర్మానాలపై చర్చ కు విపక్షాలు పట్టుబట్టాయి. దీంతో లోక్‌సభలో ప్రశ్నోత్తరాలు, జీరో అవర్ సమయం వృథాగా ఖర్చయిపో యాయి. సభాకార్యకలాపాలకు విపక్ష సభ్యులు అడ్డుతగలడంతో లోక్‌సభ, రాజ్యసభలు తలో ఆరుసార్లు వాయిదాపడ్డాయి. ఉభయ సభాపతులు ఇరుసభలను మంగళవారానికి వాయిదావేశారు.



**ఆరంభం నుంచే అట్టుడికిన లోక్‌సభ..**

ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభమైన వెంటనే మరణించిన మాజీ ఎంపీలకు నివాళులు అర్పించారు. అనంతరం స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాల సమయాన్ని ప్రారంభించేందుకు ప్రయత్నించినప్పటికీ ప్రతిపక్ష సభ్యులు వివిధ అంశాలపై చర్చ కోరుతూ వెంటనే నినాదాలు చేశారు. సభ నినాదాలతో నడవదని, సభ్యులు తమ స్థానాల్లో కూర్చొని సభా కార్యక్రమాలకు సహకరించాలని స్పీకర్ బిర్లా విజ్ఞప్తి చేశారు. అయినప్పటికీ కాంగ్రెస్, ఎస్పీ, ఆర్జేడీసహా పలు ప్రతిపక్ష సభ్యులు తమ స్థానాల్లోంచి లేచి ముందుకొచ్చి ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. నినాదాలతో లోక్‌సభలో గందరగోళం నెలకొనడంతో స్పీకర్ ఓం బిర్లా సభ్యులను శాంతించాలని మరోమారు కోరారు. అయినప్పటికీ ప్రతిపక్ష సభ్యుల ఆందోళనలు కొనసాగడంతో మొదట మధ్యాహ్నం 12 గంటల వరకు సభను వాయిదా వేశారు. అనంతరం తిరిగి ప్రారంభం అయ్యాక విపక్షాల ఆందోళన కొనసాగడంతో వాయిదాల పర్వం కొనసాగి, చివరికి సభ మంగళవారానికి వాయిదా పడింది.

**రాజ్యసభలోనూ వాయిదాల పర్వం..**

రాజ్యసభలో పత్రాల సమర్పణ, నూతన సభ్యుల ప్రమాణస్వీకారం, మృతిచెందిన సభ్యులకు సంబంధించిన సంతాప తీర్మానాల అనంతరం సభా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. వెంటనే రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే మాట్లాడారు. నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ అంశాన్ని ప్రస్తావించారు. “జంతర్‌మంతర్‌లో నిరసన తెలుపుతున్న విద్యార్థుల గొంతు ప్రభుత్వం నొక్కేస్తోంది. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన సమస్యపై చర్చ జరగాల్సిందే. జంతర్‌మంతర్‌లో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై ప్రభుత్వం బలప్రయోగం, లాఠీఛార్జి చేస్తోంది. వారి గొంతును అణచివేస్తోంది”అని ఖర్గే అన్నారు. ఖర్గే వ్యాఖ్యలపై అధికార కూటమి ఎంపీలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ మధ్యాహ్నం 12 గంటల వరకు సభను వాయిదావేశారు. తర్వాత సభ మొదలైనా పరిస్థితి అలాగే కొనసాగింది. జంతర్‌మంతర్‌లో విద్యార్థులపై లాఠీచార్జ్ చేసిన పోలీసులపై చర్య తీసుకోవాలని విపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. అయోధ్యలోని రామమందిరంలో కోట్ల రూపాయల విరాళాలను చోరీచేసిన ఉదంతంపై చర్చ జరపాలని పట్టుబట్టారు. ఈ డిమాండ్లు, నినాదాల నడుమ సభ మంగళవారానికి వాయిదా పడింది.

**లోక్‌సభ ముందుకు జడ్జీల బిల్లు..**

ఇంతటి నినాదాల హోరులోనూ ప్రభుత్వం లోక్‌సభలో ఒక బిల్లును విజయవంతంగా ప్రవేశపెట్టింది. సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను పెంచేందుకు గతంలో జారీచేసిన ఆర్డినెన్స్ స్థానంలో రూపొందించిన బిల్లును లోక్‌సభలో న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ ప్రవేశపెట్టారు.

# అంతరిక్ష రంగంలో యువత అద్భుతాలు

**న్యూఢిల్లీ:** ఈ సంవత్సరం వర్షాలు సమృద్ధిగా కురవాలని, అదేమాదిరి వర్షాకాల సమావేశాలు ఫలప్రదంగా సాగాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం సందర్భంగా సోమవారం ఆయన పార్లమెంట్ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. “రెండూ బాగుంటేనే దేశం సుభిక్షంగా ఉంటుంది. అప్పుడు అందరి జీవితాల్లో వెలుగులు నిండుతాయి. ఇదే ఆశతో ఈసారి వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుకుందాం. అదే విధంగా ఈసారి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సైతం ఫలప్రదంగా సాగాలనీ కోరుకుందాం. సభలో నిర్మాణాత్మక చర్చల ద్వారా దేశ ప్రగతికి, ప్రజా సంక్షేమానికి దోహదపడాలి. రాజకీయాలకు అతీతంగా అనుభవజ్ఞులైన ఎంపీల విజ్ఞానం దేశాభివృద్ధి కోసం ఉపయోగపడాలి. బలమైన వాదనలు ఉన్నప్పుడు ప్రశాంతంగా మాట్లాడినా మన గళాన్ని సమర్థవంతంగా వినిపించవచ్చు”అని మోదీ చెప్పారు. “దేశ పురోగతిలో యువత పాత్ర అత్యంత కీలకం. వారి సామర్థ్యాలు, ఆకాంక్షలు అంతరిక్షమంత విశాలమైనవి. గడిచిన నెల రోజుల్లో జాతీయ, అంతర్జాతీయ, అంతరిక్ష రంగాల్లో అసాధారణ మైలురాళ్లను భారత్ అధిగమించింది. భారతీయ వ్యోమగామి గత ఏడాది వర్షాకాల సమావేశాల



ముందు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లారు. ఈసారి వర్షాకాల సమావేశాలకు ముందు భారతీయ అంకుర సంస్థ స్కైరూట్ ప్రయోగించిన విక్రమ్--1 రాకెట్ విజయవంతంగా గగనతలంలోకి వెళ్లింది. భారతీయ యువత ఆశలు, ఆశయాలకు నింగిలాగా ఎలాంటి హద్దుల్లేవనడానికి ఈ విజయమే నిదర్శనం”అని మోదీ కొనియాడారు.

**7.7 శాతం వృద్ధిరేటు...**

“పశ?చమాసియాలో యుద్ధ పరిస్థితుల వల్ల అంతర్జాతీయంగా పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ, ఎరువులు, రసాయనాల దిగుమతులపై తీవ్ర ప్రభావం పడినప్పటికీ భారతదేశం 7.7 శాతం వృద్ధిరేటును నమోదుచేసింది. ప్రపంచంలోనే వేగంగా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలవడం దేశానికున్న అపారమైన శక్తికి నిదర్శనం”అని మోదీ అన్నారు.

**56 ఏళ్ల యువకుని గురించి మాట్లాడట్లేదు**
**రాహుల్‌కు మోదీ చురక**

స్కైరూట్ సంస్థ విజయం గురించి మాట్లాడుతూ రాహుల్ గాంధీనుద్దేశిస్తూ మోదీ పరో క్షంగా వ్యంగ్య వ్యాఖ్యలుచేశారు. యువకులు ఎంతో సాధిస్తున్నారని, రాహుల్ 56 ఏళ్లు వచ్చినా పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో విఫలమయ్యారనే అర్థం ధ్వనించేలా మోదీ పరోక్షంగా చురకలంటించారు. “అంతరిక్షంలో అద్భుతం సృష్టించిన స్కైరూట్ అంకురసంస్థలోని బృంద సభ్యుల సగటు వయస్సు కేవలం 28 ఏళ్లు మాత్రమే. యువత అద్భుతాలు చేస్తోంది. నేనిక్కడ 56 ఏళ్ల యువకుడి(రాహుల్) గురించి మాట్లాడటం లేదు. 28 ఏళ్ల వయస్సున్న దేశీయ యువతే అంతరిక్షంలో భారత జెండాను ఎగరేసింది”అని మోదీ వ్యాఖ్యానించారు. ప్రైవేట్ రంగానికి కల్పించిన సంస్కరణల వల్లే సాహసోపేతమైన విజ యాలను యువత సాధిస్తోందని మోదీ అన్నారు.

## కోరలు చాస్తున్న పేదరికం




దాయాది దేశం పాకిస్థాన్‌ను పేదరికం చుట్టుముడుతోంది. గడిచిన ఆరేళ్లలో దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఒడిదొడుకులకు లోనుకావడంతో నిరుపేదల సంఖ్య ప్రమాదకర స్థాయిలో పెరిగిపోయింది. వరుస ఆర్థిక సంక్షోభాలు, అధిక ద్రవ్యోల్బణం, బలహీనమైన వృద్ధి రేటు వంటి కారణాలతో కుటుంబ ఆదాయాలు గణనీయంగా క్షీణించాయి. ఫలితంగా దేశ జనాభాలో దాదాపు 29 శాతం మంది పేదరిక రేఖకు దిగువన జీవిస్తున్నారని ఒక తాజా నివేదిక వెల్లడించింది. 2018-19లో 21.8 శాతంగా ఉన్న పేదరికం, 2024-25 నాటికి 28.9 శాతానికి చేరింది. అంటే కేవలం ఆరేళ్లలోనే పేదరికం 7 శాతం పెరిగింది. హౌస్‌హోల్డ్ ఇంటిగ్రేటెడ్ ఎకనామిక్ సర్వే (హెచ్‌ఐఈఎస్), పాకిస్థాన్ సోషల్ అండ్ లివింగ్ స్టాండర్డ్స్ మెజర్‌మెంట్ (పీఎస్ఎల్ఎం) డేటా ఆధారంగా ‘డాన్’ పత్రిక ఈ విశ్లేషణను ప్రచురించింది. దాదాపు ఆరేళ్ల విరామం తర్వాత విడుదలైన ఈ గణాంకాలు.. దేశం ఎదుర్కొన్న బహుళ సంక్షోభాల ప్రభావాన్ని స్పష్టం చేస్తున్నాయి. పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాలపై ఈ ప్రభావం మరింత తీవ్రంగా ఉంది. గ్రామీణ పాకిస్థాన్‌లో పేదరికం సుమారు 8 శాతం మేర పెరగగా, పట్టణ ప్రాంతాల్లో ఇది 6 శాతంగా నమోదైంది. పదేపదే తలెత్తిన చెల్లింపుల సంక్షోభం, కోవిడ్-19 మహమ్మారి, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, దీర్ఘకాలిక స్థూల ఆర్థిక సర్దుబాట్లు వంటివి ఈ దుస్థితికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. విశ్లేషకులు ఈ పరిస్థితిని జీవన ప్రమాణాల మెరుగుదల విషయంలో ‘కోల్పోయిన దశాబ్దం’గా అభివర్ణిస్తున్నారు. గత రెండు సర్వేల మధ్య కాలంలో ద్రవ్యోల్బణాన్ని సర్దుబాటు చేసిన తర్వాత చూస్తే, సగటు కుటుంబ ఆదాయాలు, వినియోగం గణనీయంగా తగ్గినట్లు నివేదిక పేర్కొంది. ఆర్థిక వృద్ధి సానుకూలంగా ఉన్నప్పటికీ, పేదరికం పెరగడం ఆందోళన కలిగించే అంశం. ఈ వృద్ధి ఫలాలు ఎక్కువగా ఉన్నత ఆదాయ వర్గాలకే చేరాయని, దిగువ ఆదాయ వర్గాల వాస్తవ ఆదాయాలు, కొనుగోలు శక్తి తీవ్రంగా దెబ్బతిన్నాయని ఇది సూచిస్తోంది.

పేద కుటుంబాలు ఎక్కువగా రోజువారీ వేతనాలపై ఆధారపడతాయి. అధిక ద్రవ్యోల్బణం, ఆర్థిక అంతరాయాల వల్ల ఈ వర్గాలే ఎక్కువగా నష్టపోయాయి. మరోవైపు, సంపన్న వర్గాలు రియల్ ఎస్టేట్, ఆర్థిక పెట్టుబడుల వంటి ఆస్తులను కలిగి ఉండటంతో, ధరల పెరుగుదల ప్రభావాన్ని తట్టుకోగలిగారు. దీంతో దేశంలో ఆదాయ అసమానతలు మరింత పెరిగాయి. ప్రస్తుత భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, బాహ్య ఆర్థికపరమైన రిస్కుల మధ్య, పెరుగుతున్న పేదరికాన్ని, విస్తరిస్తున్న అసమానతలను పరిష్కరిస్తూనే ఆర్థిక వృద్ధిని కొనసాగించడం పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థకు పెను సవాలుగా మారింది.

## డిమాండ్లు నెరవేరే వరకు ఆందోళనలు కొనసాగుతాయి




నీట్-యూజీ 2026 ప్రశ్నాపత్రం లీకేజీతో పాటు పలు పరీక్షల్లో జరిగిన అవకతవకలపై ఆరోపణలు వెల్లువెత్తడంతో ఢిల్లీలో నిరసనలు ఉద్ధృతమయ్యాయి. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో ఆందోళనలు కొనసాగుతున్న నేపథ్యంలో, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేతలు సోమవారం కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో భేటీ అయ్యారు. సీజేపీ ప్రతినిధులు సౌరవ్ దాస్, అశుతోష్ రంకా ఢిల్లీలోని నడ్డా నివాసంలో సుమారు 10 నిమిషాల పాటు సమావేశమై, తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ సమస్యపై అంతర్గతంగా ఉన్నత స్థాయిలో చర్చిస్తామని మంత్రి హామీ ఇచ్చారని, అయితే ఎటువంటి నిర్దిష్ట హామీలు లభించలేదని సౌరవ్ దాస్ ‘ఎక్స్’ వేదికగా వెల్లడించారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు శాంతియుత పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం రోజే సీజేపీ ‘పార్లమెంట్ ముట్టడి’కి పిలుపునివ్వడంతో జంతర్ మంతర్ వద్దకు విద్యార్థులు, యువత భారీగా చేరుకున్నారు. అక్కడి నుంచి పార్లమెంట్ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన నిరసనకారులను పోలీసులు అడ్డుకున్నారు. నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నప్పటికీ ముందుకు వెళ్లేందుకు యత్నించిన ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు కొన్నిచోట్ల లాఠీఛార్జ్ చేయడంతో పాటు బాష్పవాయువును ప్రయోగించారు. సోషల్ మీడియాలో ఒక వ్యంగ్య ఉద్యమంగా ఆరంభమైన కాక్రోచ్ జనతా పార్టీ, ప్రస్తుతం పరీక్షల లీకేజీలు, సాంకేతిక వైఫల్యాలపై నిరంతరాయంగా పోరాడుతోంది. ఈ ఉద్యమానికి మద్దతుగా పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ సుదీర్ఘ నిరాహార దీక్ష చేపట్టారు. ఆందోళనలు ప్రారంభమైన తర్వాత సీజేపీ నేతలతో కేంద్ర ప్రభుత్వం ఉన్నత స్థాయిలో చర్చలు జరపడం ఇదే ప్రథమం. తమ డిమాండ్లు నెరవేరే వరకు శాంతియుత నిరసనలు కొనసాగిస్తామని సీజేపీ నాయకత్వం తేల్చిచెప్పింది.

## జగన్నాథుడి ఆభరణాల లెక్కింపు పూర్తి!

పూరి: ఒడిశా పవిత్ర పుణ్యక్షేత్రం పూరి జగన్నాథుడి ఆభరణాల భాండాగారం రత్నభాండార్ ప్రత్యేక లెక్కింపు పూర్తయినట్లు అధికారులు ప్రకటించారు. అంతర్జాతీయ ప్రఖ్యాత పూరి జగన్నాథ యాత్ర ముగిసి జగన్నాథ, బలభద్రులు ఇద్దరు గుండిచ దేవస్థానంలోకి ప్రవేశించిన తరువాత ఈ ప్రత్యేక పరిశీలన నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.ఒడిశా ప్రభుత్వం నిర్దేశించిన రీతిలో ఆదివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. దేవాలయంలోని వేర్వేరు పండుగల నేపథ్యంలో రత్నభాండార్ ప్రత్యేక పరిశీలన కార్యక్రమాన్ని మే నెల 23వ తేదీన నిలిపివేసిన విషయం తెలిసిందే. గత నెలలో స్నాన పూర్ణిమ సందర్భంగా ఉత్సవమూర్తుల నుంచి తొలగించిన ఆభరణాల లెక్కింపు, బరువు తూచడం వంటివి చేశారు. ‘రాహు రేఖ’, బంగారు ‘చితా’, వెండి ‘రసిక’ఆభరణాలతోపాటు విగ్రహాలకు సంబంధించిన ఇతర ఆభరణాలను కూడా లెక్కించామని, శ్రీ జగన్నాథ్ దేవాలయ అడ్మినిస్ట్రేషన్ ప్రధాన అడ్మినిస్ట్రేటర్ అరబింద పాధే తెలిపారు. “డిజిటల్ డాక్యుమెంటేషన్‌లో భాగంగా లెక్కింపు, బరువు తూచే ప్రక్రియ మొత్తాన్ని వీడియో తీశాం”అని ఆయన తెలిపారు. ఆభరణాల్లోని రత్నాలు, ఇతర విలువైన రాళ్లను నిపుణులు పరిశీలించారని, తెలిపారు. ప్రభుత్వం ఆమోదించిన ప్రామాణిక ప్రక్రియకు అనుగుణంగా లెక్కింపు ప్రక్రియ పూర్తిచేసినట్లు రత్నభాండార్ పరిశీలన కమిటీ అధ్యక్షులు జస్టిస్ (రిటైర్డ్) బిశ్వనాథ్ రథ్ తెలిపారు. దేవాలయానికి సంబంధించి రెండు రత్నభాండార్‌లు ఉంటే అందులోని బయటి భండాగారం లెక్కింపు ప్రక్రియ ప్రస్తుతం పూర్తవగా లోపలి దాని లెక్కింపు కొనసాగుతున్నట్లు మరో అధికారి తెలిపారు.

# ఆపదలో అండగా... ఆర్టీసీ ఒకే కుటుంబం..!




-మొదటిపేజీ తరువాయి

స్వచ్ఛందంగా సేకరించిన రూ. 90,85,500 (తొంభై లక్షల ఎనభై ఐదు వేల ఐదు వందల రూపాయల) భారీ ఆర్థిక సహాయ చెక్కును సోమవారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళాభవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో శంకర్ కుటుంబ సభ్యులకు అందజేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ఎండీ వై.నాగిరెడ్డి ల చేతుల మీదుగా దివంగత డ్రైవర్ సతీమణి హేమలత, కుమారుడు హేమంత్, కుమార్తె షాలినిలకు ఈ చెక్కును అందజేసి సంస్థ తరపున పూర్తి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, కార్మికుల కోసం ప్రాణత్యాగం చేసిన దివంగత కోల శంకర్ కుటుంబానికి ఆర్టీసీ ఉద్యోగులందరూ అండగా నిలవడం వారి మానవత్వానికి నిదర్శనమన్నారు. శంకర్ ఆసుపత్రిలో ఉన్న సమయంలో అర్ధరాత్రి వేళ స్వయంగా వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న విషయాన్ని మంత్రి ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.

ఆ కుటుంబానికి ప్రజా ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, అందులో భాగంగానే దివంగత శంకర్ కుమారుడు హేమంత్‌కు ఆర్టీసీలో ఉద్యోగం కల్పిస్తున్నామని, అలాగే ఆ కుటుంబానికి ఇల్లు కూడా మంజూరు చేశామని ప్రకటించారు.

గత ప్రభుత్వాల కాలంలో ఆర్టీసీ కార్మిక సంఘాలను ఎత్తివేసి, నిరంకుశంగా వ్యవహరించారని మంత్రి విమర్శించారు. అయితే రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆర్టీసీలోని ప్రతి సమస్యను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తున్నామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించే మహాలక్ష్మి పథకం ప్రారంభమైనప్పటి నుండి ప్రభుత్వం నెలకు రూ. 300 కోట్లు ఆర్టీసీకి విడుదల చేస్తోందని, ఈ పథకం వల్ల పనిభారం పెరిగినప్పటికీ సిబ్బంది ఎంతో కష్టపడి విజయవంతం చేస్తున్నారని కొనియాడారు. ముఖ్యంగా రాఖీ పౌర్ణమి వంటి పండుగ రోజుల్లోనూ మహిళా ప్రయాణికుల కోసం కార్మికులు తమ సోదరులకు రాఖీ కట్టి మరీ విధులు నిర్వహించడం వారి నిబద్ధతకు అద్దం పడుతోందన్నారు.

కార్మికుల సంక్షేమంతో పాటు వారి కుటుంబాల భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, రూ. 6 లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్న ఆర్టీసీ ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ సిబ్బందితో సహా ప్రతి ఒక్కరూ ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని మంత్రి స్పష్టం చేశారు. రిటైర్డ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కూడా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో సంస్థ పరిరక్షణ, ప్రయాణికుల సౌలభ్యం, కార్మికుల సంక్షేమం అనే మూడు ప్రధాన అంశాల ఆధారంగా సంస్థను ముందుకు తీసుకెళ్తామన్నారు. కార్మిక సంఘాల ఎన్నికల అనంతరం నలుగురు మంత్రులు, అధికారుల కమిటీ తీసుకున్న నిర్ణయం మేరకు ఆర్టీసీ విలీన ప్రక్రియను కూడా ప్రారంభిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అలాగే క్యూర్ ఏరియా పరిధిలో అత్యాధునిక బస్ టెర్మినల్ నిర్మిస్తామని, గ్రామాల నుండి రాజధాని వరకు కొత్త రూట్లలో బస్సులు నడుపుతూ, మెట్రో మరియు వీమీూ సర్వీసులతో ఆర్టీసీని అనుసంధానం చేసి రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని వెల్లడించారు. ఆర్టీసీ పేదవాడి గుండె చప్పుడు అని, కాబట్టి యాజమాన్యం తీసుకుంటున్న సంక్షేమ, అభివృద్ధి చర్యల్లో ఉద్యోగులంతా మరింత బాధ్యతగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డి మాట్లాడుతూ తోటి ఉద్యోగి కుటుంబం కష్టాల్లో ఉన్నప్పుడు సంస్థలోని సిబ్బంది అంతా ఏకతాటిపైకి వచ్చి రూ. 90.85 లక్షల భారీ ఆర్థిక సహాయాన్ని అందించడం ఆర్టీసీ ఉద్యోగులలో ఉన్న అంతర్గత బంధానికి, పరస్పర సహకారానికి ఒక గొప్ప నిదర్శనమన్నారు. సాయం చేయడానికి ముందుకు వచ్చిన ప్రతి ఒక్క ఉద్యోగికి ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఒక ఉద్యోగి కష్టంలో ఉంటే మొత్తం సంస్థ అండగా నిలవాలనే గొప్ప సంస్కృతి టీజీఎస్ ఆర్టీసీ సొంతమని, ఈ కార్యక్రమం ఆ విలువలను మరోసారి చాటిచెప్పిందన్నారు.

ఉద్యోగుల సంక్షేమం కోసం యాజమాన్యం కట్టుబడి ఉందని, సిబ్బందికి అవసరమైన భద్రత, శిక్షణ, పని పరిస్థితుల మెరుగుదల కోసం నిరంతర చర్యలు తీసుకుంటున్నామని ఎండీ స్పష్టం చేశారు. ప్రయాణికుల భద్రతే తమ తొలి ప్రాధాన్యమని, ప్రతి డ్రైవర్, కండక్టర్ అత్యంత బాధ్యతతో విధులు నిర్వహిస్తూ ప్రజలను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తున్నారని, వారి సేవలు అమూల్యమైనవని కొనియాడారు. సంస్థ ఆర్థిక బలోపేతంతో పాటు ఉద్యోగుల సంక్షేమం కూడా సమానంగా ముఖ్యమని యాజమాన్యం విశ్వసిస్తోందని, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు తాము అందుబాటులో ఉంటామన్నారు. ప్రయాణికులకు నాణ్యమైన, సురక్షితమైన, సమయపాలనతో కూడిన సేవలు అందించేందుకు డిజిటల్ సేవలు, ఆన్‌లైన్ టికెటింగ్, బస్సుల ఆధునీకరణ వంటి ఆధునిక సాంకేతికతను విస్తృతంగా వినియోగిస్తున్నట్లు తెలిపారు.

## ఆదిలాబాద్ జిల్లాలో పారిశ్రామిక పార్కు భూసేకరణలో

# మాయాజాలం

### రూ. కోట్లు కొట్టేసేందుకు అధికార పార్టీలోని బడా నేతలు, విపక్ష ఎమ్మెల్యే కుమ్మక్కు?

### ఓ సంస్థ భూములను వేలంలో కొన్న మరో సంస్థ.. మ్యుటేషన్ జరగకపోవడంతో రంగంలోకి అక్రమార్కులు

### 500 ఎకరాలకుపైగా భూముల పరిహారం నొక్కేసేందుకు ఇతరుల పేరిట భూములు మార్చి దోపిడీకి స్కెచ్!

### భూ బదలాయింపు జాబితాలో ఓ సిమెంట్ కంపెనీ సహా కొందరు వ్యక్తులు

### ఈ వ్యవహారంపై విచారణ జరిపితే అక్రమాలు నిగ్గుతేలే అవకాశం

**హైదరాబాద్:** ఆదిలాబాద్ జిల్లాలో పారిశ్రామిక పార్కు ఏర్పాటు కోసం ప్రభుత్వం విడుదల చేసిన భూసేకరణ నోటిఫికేషన్‌ను అడ్డుపెట్టుకొని పరిహారం కొట్టేసేందుకు కొందరు అక్రమార్కులు స్కెచ్ వేశారు. బ్యాంకులో తనఖాలో ఉన్న ఓ ప్రైవేటు సంస్థకు చెందిన భూములను అక్రమంగా తమ పేరిట రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేసుకున్నారు. సదరు ప్రైవేటు సంస్థ బ్యాంకులో తనఖా పెట్టిన భూములు ఆ సంస్థ పేరిట మ్యుటేషన్ కాకపోవడాన్ని అనువుగా మలుచుకున్నారు. దీంతో ప్రభుత్వం జారీ చేసిన భూసేకరణ నోటిఫికేషన్‌లో అడ్డదారిలో రెవెన్యూ రికార్డుల్లోకి ఎక్కిన అక్రమార్కులనే పట్టాదారులుగా పేర్కొన్నారు. దీంతో తమవి కాని భూములపై రూ. కోట్లలో పరిహారం కొట్టేసేందుకు భూసేకరణ నోటిఫి కేషన్‌ను అక్రమార్కులు అడ్డుపెట్టుకున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. పరిహారం కొట్టేసేందుకే పారి శ్రామిక పార్కు ఏర్పాటు ప్రతిపాద నను తెర పైకి తెచ్చారని విమర్శలు కూడా ఉన్నాయి. ఈ ప్రయత్నాలకు అధికార పార్టీకి చెందిన బడా నేతలతోపాటు విపక్ష పార్టీకి చెందిన శాసనసభ్యుడి సహకారం ఉందని సమాచారం. కేంద్రంలో రోజూ కత్తులు దూసు కునే పార్టీల ముఖ్య నేతలు పరిహారం కొట్టేసేందుకు కలసి కట్టుగా కుట్ర పన్నినట్లు ఆరోపణలు వస్తున్నా యి.



**ముందు కొన్నదొకరు.. వేలంలో కొన్నదొకరు**

ఆదిలాబాద్ జిల్లా భోరజ్ మండలం హత్తీఘాట్, రాంపూర్, గూడ, గిమ్మబి గ్రామాల్లో 2062.01 ఎకరాల్లో పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇందులో భాగంగా హత్తీఘాట్ పరిధిలో 1,194.10 ఎకరాలు, గూడలో 259.23 ఎకరాల భూసేకరణకు మే 29న రెవెన్యూ శాఖ ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేసింది. హత్తీఘాట్‌లో 298 సర్వే నంబర్లు, గూడలో 83 సర్వే నంబర్ల పరిధిలోని భూమిని సేకరిస్తున్నట్లు యజమానుల పేర్లతో నోటిఫికేషన్ ఇచ్చింది. అయితే జీఎస్ బయోటెక్ లిమిటెడ్ అనే సంస్థ బ్యాంకులో తనఖా పెట్టిన భూములు కూడా ఇందులో ఉన్నాయి. ఆదిలాబాద్‌కు చెందిన ఈ సంస్థ.. ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్‌తోపాటు మహారాష్ట్రలోని నాందేడ్‌లో స్థానికుల నుంచి 3,103.41 ఎకరాల భూమి కొనుగోలు చేసింది.

కాలక్రమంలో ఈ భూములను ఎస్‌బీఐ, యుకో, బ్యాంక్ ఆఫ్ మారిషస్ వంటి బ్యాంకుల్లో తనఖా పెట్టి రూ. వందల కోట్లు రుణం తీసుకుంది. అయితే జీఎస్ బయోటెక్ రుణాలు చెల్లించకపోవడంతో ఎస్‌బీఐ నేషనల్ కంపెనీ ఆఫ్ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)ను ఆశ్రయించింది. 2022 చివరి నాటికే తమకు రూ. 770 కోట్లకుపైగా రావాల్సి ఉందని ఎస్‌బీఐ పేర్కొంది. ఈ నేపథ్యంలో 2023 మార్చిలో హైదరాబాద్ ఎన్‌సీఎల్‌టీ దివాలా ప్రక్రియను ప్రారంభించినా అది ముందుకు సాగలేదు. దీంతో కంపెనీ ఆస్తుల విక్రయానికి (లిక్విడేషన్) 2024 సెప్టెంబర్‌లో ఆమోదం లభించింది. 2025 డిసెంబర్ 31న జరిగిన ఈ వేలంలో బెంగళూరుకు చెందిన ఓ సంస్థ రూ. 40.20 కోట్లకు ఆదిలాబాద్ జిల్లా భోరజ్ మండలంలోని భూములతోపాటు మరికొన్ని భూములను దక్కించుకుంది.

ఈ మేరకు జీఎస్ బయోటెక్ లిక్విడేటర్ ఈ ఏడాది జనవరి 12న వేలంలో అత్యధిక బిడ్ వేసిన సంస్థకు లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్‌ఓఐ) కూడా పంపించారు. బిడ్‌ను పొందిన బెంగళూరు సంస్థ.. ఆ భూములను తమ పేరిట రెవెన్యూ రికార్డుల్లో బదలాయింపు చేయాలంటూ అధికారుల చుట్టూ తిరుగుతోంది. ఈ పని కాకపోవడంతో భూసేకరణ నోటిఫికేషన్‌లో సదరు భూములకు సంబంధించిన యజమానిగా ఈ సంస్థ పేరు లేదు. గతంలో జీఎస్ బయోటెక్ పేరిట మ్యుటేషన్ జరగకపోవడంతో ఆ సంస్థ పేరు కూడా లేదు. దీంతో పరిహారం దోపిడీకి తెరలేచిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**అక్రమంగా ఇతరుల పేరిట మార్చి..**

గతంలో భూములు అమ్మిన యజమానులతో కుమ్మక్కైన అక్రమార్కులు.. జీఎస్ బయోటెక్‌కు చెందిన 500 ఎకరాలకుపైగా భూములను వక్ర మార్గంలో ఇతరుల పేర్లకు మార్చి దోపిడీకి తెరతీశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ తరహాలో భూములు పొందిన జాబితాలో డెక్కన్ సిమెంట్స్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. విపక్ష ఎమ్మెల్యే కుమారుడు, కుటుంబ సభ్యులతోపాటు రాష్ట్రంలోని అధికార పార్టీకి చెందిన అత్యంత కీలక నేతలు ఇందులో భాగస్వాములుగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. పారిశ్రామిక పార్కు భూసేకరణ కోసం ఇచ్చిన నోటిఫికేషన్‌లోని సర్వే నంబర్లలోని వివరాలు కూడా అనుమానాలను బలపరిచేలా ఉన్నాయి. ప్రస్తుత మార్కెట్ విలువకు 3--4 రెట్లు అధికంగా పరిహారం వచ్చే అవకాశం ఉండటంతో రూ. కోట్లు కొట్టేసే ప్రణాళికల్లో భాగంగానే పారిశ్రామిక పార్కు ఏర్పాటు ప్రతిపాదనను తెరపైకి తెచ్చారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. గతంలో జరిగిన ఏరియల్ సర్వేలో అధికార పార్టీ నేతలతోపాటు విపక్ష ఎమ్మెల్యే కూడా పాల్గొనడాన్ని స్థానికులు ప్రస్తావిస్తున్నారు. సుమారు 500 ఎకరాలకు సంబంధించి జీఎస్ బయోటెక్ భూములను అక్రమార్కులు తమ పేరిట మార్చుకున్నట్లు సమాచారం.

**సర్వే నంబర్ 39లో ఎన్ని అక్రమాలో..!**

హత్తీఘాట్ సర్వే నంబర్ 39లోని 33.31 ఎకరాలను జీఎస్ బయోటెక్‌కు చెందిన సుమన్ అగర్వాల్ 2006 డిసెంబర్ 11న (డాక్యుమెంట్ నంబర్ 361/06) కొనుగోలు చేశారు. మరుసటి ఏడాది ఎస్‌బీహెచ్‌కు తనఖా (డాక్యుమెంట్ నంబరు 4790/07) పెట్టారు. అయితే ఇదే భూమిని తూడెం గణేశ్ అనే వ్యక్తి ఉగ్గె సత్యనారాయణ (డాక్యుమెంట్ 7068/2016)కు విక్రయించినట్లు రికార్డుల్లో ఉంది. తిరిగి అదే వ్యక్తి డెక్కన్ సిమెంట్స్‌కు 33.31 ఎకరాలు విక్రయించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రెవెన్యూ శాఖ జారీ చేసిన భూసేకరణ నోటిఫికేషన్‌లో డెక్కన్ సిమెంట్స్ పేరిట 30.31 ఎకరాలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఇదే తరహాలో గూడ గ్రామంలోని 112/1/3 సర్వే నంబర్ భూములు కూడా విపక్ష ఎమ్మెల్యే కుమారుడు డెక్కన్ సిమెంట్స్‌కు విక్రయించినట్లు తెలుస్తోంది. అలాగే సర్వే నంబర్లు 114, 115, 117తోపాటు పలు సర్వే నంబర్లకు సంబంధించి జరిగిన లావాదేవీలు, లిక్విడేటర్ వేలం వేసిన భూముల్లో సైతం ఇవే సర్వే నంబర్లు ఉండటం అనుమానాలకు తావిస్తోంది. ఈ అంశంపై లోతైన విచారణ జరిపితే అక్రమాలు పూర్తిస్థాయిలో బయటపడే అవకాశం ఉంది.

## ఎల్ నినోను ఎదుర్కొంటాం

**హైదరాబాద్:** ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా సిద్ధంగా ఉందని, రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. నల్లగొండ జిల్లా కలెక్టరేట్ లోని ఉద్యాదిత్య భవన్ లో నల్లగొండ, సూర్యపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల అధికారులతో ఎల్ నినో సంసిద్ధత, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహంపై సోమవారం (జూలై 20) ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఎల్ నినో ప్రభావం వల్ల రాబోయే రోజుల్లో ప్రజలకు ఎలాంటి తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశించారు. నీటి లభ్యతను బట్టి రైతులు కేవలం వరి పంటపైనే ఆధారపడకుండా, లాభదాయకమైన ప్రత్యామ్నాయ పంటలు వేసేలా అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాకు సాగునీరు అందించే అత్యంత ప్రతిష్టాత్మకమైన శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగ మార్గం పనులను 2028 ఆగస్టు నాటికి పూర్తి చేస్తామని మంత్రి ప్రకటించారు. దీని ద్వారా ఉమ్మడి జిల్లాలోని 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని వెల్లడించారు. ఈ సొరంగం పనులను వేగవంతం చేయడానికి ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని ఆయన కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ఎలాంటి ప్రకృతి విపత్తులనైనా సమర్థవంతంగా ఎదుర్కొని ప్రజలను ఆదుకుంటామని మంత్రులు ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో పాటు రాష్ట్ర ఇరిగేషన్, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, నల్లగొండ నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు,ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణలో భూసేకరణకు ప్రత్యేక చట్టం

-మొదటిపేజీ తరువాయి

సాగుతోంది. ఈ ప్రక్రియ పూర్తయ్యాక వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ల్యాండ్ పూలింగ్ బిల్లును ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. గుజరాత్, తమిళనాడు, మహారాష్ట్ర రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలు మెరుగ్గా ఉన్నాయని గుర్తించినట్లు తెలుస్తోంది. తెలంగాణలో ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా అమలయ్యే ప్రత్యేక ల్యాండ్ పూలింగ్?కు సంబంధించి ఎటువంటి చట్టం లేదు. అందుకు అనుగుణంగా కొత్త చట్టాన్ని రూపొందించే దిశగా ప్రభుత్వం ముమ్మరంగా అడుగులు వేస్తోంది.

**అటు యజమానులకు, ఇటు ప్రభుత్వానికి లాభం**

రాష్ట్రంలో నేషనల్ హైవేలు, రైల్వే లైన్లు, రీజినల్ రింగ్ రోడ్, పారిశ్రామిక కారిడార్లు, ఇండస్ట్రియల్ పార్కులు, టౌన్‌షిప్‌లు, ప్రతిపాదిత హైస్పీడ్ రైలు మార్గాలు, విమానాశ్రయాల విస్తరణ, సాగునీటి ప్రాజెక్టులు వంటి అభివృద్ధి, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు భారీగా భూములు అవసరం అవుతున్నాయి. ప్రస్తుతం ఏదైనా ప్రాజెక్టుకు భూసేకరణ ప్రారంభించగానే తమ భూములు పోతాయనే భయంలో రైతులు ఉంటున్నారు. నిరసన బాట పడుతున్నారు. ఈక్రమంలో ప్రాజెక్టులతో అందరికీ సమానంగా ప్రయోజనం చేకూరే విధానాన్ని రూపొందించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని ల్యాండ్ పూలింగ్ అధ్యయనం టీంలోని ఒక ఉన్నతాధికారి తెలిపారు.

పూలింగ్‌లో తీసుకున్న భూముల్లో మౌలిక వసతుల ఏర్పాటు అనంతరం కొంత భాగాన్ని ప్లాట్ల రూపంలో తిరిగి భూయజమానులకు కేటాయించే విధానంపై అధికారులు తీవ్ర కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో భారీ సాగునీటి ప్రాజెక్టులు చిన్నచిన్న భూసమస్యల కారణంగా జాప్యానికి గురవుతున్న నేపథ్యంలో ఇరిగేషన్ శాఖను కూడా ఈ ప్రక్రియలో ప్రభుత్వం పాల్గొనేలా చేసింది.

**త్వరలో ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీ**

ల్యాండ్ పూలింగ్ ముసాయిదా బిల్లు ప్రస్తుతం ప్రాథమిక దశలో ఉన్నట్లు సమాచారం. ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు, కొత్త విధానానికి తుదిరూపు ఇచ్చేందుకు వివిధ శాఖల ఉన్నతాధికారులతో త్వరలోనే ప్రత్యేక కమిటీని రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుందని తెలుస్తోంది. ఆ కమిటీ సిఫారసుల ఆధారంగా బిల్లుకు తుది రూపం ఇవ్వనున్నట్లు సంకేతాలు వస్తున్నాయి. భూసేకరణకు చట్టబద్ధ ప్రత్యామ్నాయాన్ని తీసుకురావడం, రాష్ట్రవ్యాప్తంగా ఇంటిగ్రేటెడ్ విధానం వంటి ప్రయోజనాలు ఉంటాయని ప్రభుత్వం భావిస్తోంది.

**ఉప్పల్ భగాయత్ మోడల్, రాష్ట్రవ్యాప్త చట్టబద్ధం**

గతంలో హైదరాబాద్‌లోని ఉప్పల్ భగాయత్ ప్రాంతంలో హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్?మెంట్ అథారిటీ భూయజమానుల భాగస్వామ్యంతో ల్యాండ్ పూలింగ్‌ను చేపట్టింది. అందులో కొంత భూమిని మెట్రో రైలు ప్రాజెక్టుకు, ఇతర అవసరాలకు వినియోగించింది. మిగిలిన దాంట్లో కొంత భూమి యజమానులకు అభివృద్ధి చేసిన ప్లాట్ల రూపంలో అందజేసింది. ఈక్రమంలో ఇక్కడ ల్యాండ్ పూలింగ్‌లో అనుభవమున్న హెచ్‌ఎండీఏలోని ఓ ఉన్నతాధికారికి బిల్లు రూపకల్పనలో కీలక బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం.

## క్యూఆర్ కోడ్‌తో స్మార్ట్ రేషన్




-మొదటిపేజీ తరువాయి

లబ్ధిదారులు వాడుతున్న ఏ4 సైజు కాగితపు కార్డులు త్వరగా చిరిగిపోవడం, పాడైపోతుండటంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కొత్తగా అందించే స్మార్ట్ కార్డులపై లబ్ధిదారుడి వివరాలతో పాటు ప్రత్యేకమైన క్యూఆర్ కోడ్, ఆహార భద్రతా కార్డు నంబర్‌ను ముద్రించారు. భద్రతా ఫీచర్లతో పాటు సీఎం రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫొటోలు కూడా ఉంటాయి. ఈ స్మార్ట్ కార్డుల ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థలో మరింత పారదర్శకత వస్తుందని అధికారులు విశ్వసిస్తున్నారు.

రాజధానిలో సీఎం కార్యక్రమాన్ని ప్రారంభిస్తుండగా, అదే సమయంలో రాష్ట్రంలోని మొత్తం 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల చేతుల మీదుగా లబ్ధిదారులకు కొత్త కార్డులు అందజేయనున్నారు. ఈ బృహత్తర కార్యక్రమం కోసం పౌరసరఫరాల శాఖ సమగ్ర ప్రణాళికను రూపొందించింది.

**ఒకేసారి మూడు నెలల బియ్యం**

ఇదిలాఉంటే.. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పేదలకు ఇబ్బంది కలగకుండా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయనుంది. ఆగస్టు 1 నుంచి నెల రోజుల పాటు రేషన్ దుకాణాలు తెరిచి ఉంటాయి. లబ్ధిదారులు మూడుసార్లు వేలిముద్రలు వేసి తమ కోటాను పొందవచ్చు.

అయితే, ఈసారి రేషన్ సరుకులు పొందాలంటే ఈ-కేవైసీ తప్పనిసరి అని అధికారులు స్పష్టం చేశారు. ఈ-కేవైసీ పూర్తి చేసుకునేందుకు జులై 31ని ఆఖరి తేదీగా నిర్ణయించారు. ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు కూడా తమకు దగ్గరలోని రేషన్ దుకాణంలో ఈ-కేవైసీ పూర్తి చేసుకోవచ్చని అధికారులు సూచించారు. గడువులోగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోని వారికి రేషన్ సరుకులు అందవని స్పష్టం చేశారు.

# దేశ ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్దడంలో వైశ్యులు కీలక పాత్ర పోషించాలి

- విజిలెన్సు ఙ ఎన్ఫోర్స్మెంట్, ఎస్.పి, డి. శ్రీనివాస్

క్షేత్రస్థాయి దాతృత్వంలో వైశ్యులు ఎల్లప్పుడు ముందుండాలి

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చికోటి ప్రవీణ్ కుమార్

ఘనంగా గ్రేటర్ వైశ్య బిజినెస్ లీడర్స్ ప్రథమ వార్షికోత్సవం



**హైదరాబాద్, తెలంగాణ కానుక** భారత దేశంలో క్రీ.పూ. 3వ శతాబ్దం నుండి వ్యాపారులుగా, వర్తకులుగా గొప్ప గుర్తింపు పొందిన , వైశ్యులు దేశ ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్దడంలో మరింత కీలక పాత్ర పోషించాలని విజిలెన్సు ఙ ఎన్ఫోర్స్మెంట్, ఎస్.పి, డి. శ్రీనివాస్ కోరారు. హైదరాబాద్ లోని ఓ ఫంక్షన్ హాల్ లో ఉత్సాహభరితమైన వాతావరణంలో ఘనంగా గ్రేటర్ వైశ్య బిజినెస్ లీడర్స్ (జీవీబీఎల్) ప్రథమ వార్షికోత్సవం జరిగింది. ఈ వార్షికోత్సవ సభకు జీవీబీఎల్ వ్యవస్థాపకులు, సిఈఓ రాజశేఖర్ మంచీ అధ్యక్షత వహించగా డి. శ్రీనివాస్, చికోటి ప్రవీణ్ కుమార్, కెపిసి ప్రాజెక్ట్స్ సిఎండి కె. అనిల్ కుమార్, సుధాకర్ పివిసి డైరెక్టర్ మీలా జయదేవ్ ముఖ్యఅతిథిలుగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా డి. శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజం యొక్క సామాజిక, ఆర్థిక స్థితిని ఉన్నతీకరించడం, హక్కులను పరిరక్షించడం, మరియు నైతిక, మేధో, వాణిజ్య, ఆర్థిక, రాజకీయ రంగాలలో ప్రయోజనాలను ప్రోత్సహించడం వంటి లక్ష్యంతో పనిచేయాలన్నారు. చికోటి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ కష్టపడి పనిచేసే గుణం, అంకితభావం, వ్యవస్థాపక స్ఫూర్తి, వ్యాపార చతురతకు నిదర్శనంగా వైశ్యులు భారత ఆర్థిక వ్యవస్థపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతూ దేశ జీడీపీ వృద్ధికి కూడా దోహదపడుతున్నారని తెలిపారు కేవలం లాభాలు సంపాదించడమే కాకుండా, తమ వ్యాపార ప్రయత్నాల ద్వారా అధికారాన్ని, సామాజిక హోదాను కూడా పొందాలని లక్ష్యంగా పెట్టుకుంటూ క్షేత్రస్థాయి దాతృత్వంలో వైశ్యులు ఎల్లప్పుడు ముందుండాలని కోరారు. రాజశేఖర్ మంచీ మాట్లాడుతూ భారతదేశ ఆర్థిక వ్యవస్థకు గణనీయమైన తోడ్పాటును అందించడం కోసం వైశ్యులు కలిసి ఎదగడం, ఒకరి పరిచయాలు మరియు నెట్వర్క్ల నుండి ప్రయోజనం పొందడం, భారతదేశంలో మరియు ప్రపంచవ్యాప్తంగా బలమైన వ్యాపారవేత్తలుగా, వ్యవస్థాపకులుగా ఎదగడం అనే లక్ష్యంతో జీవీబీఎల్ ప్రారంభించబడిందని తెలిపారు. సాంప్రదాయ వ్యాపారాలను ఆధునిక కార్పొరేట్ సంస్థలుగా విస్తరించడం, నూతన ఆధునిక పరిశ్రమలు, వర్ధమాన స్టార్టప్‌లను ప్రోత్సహించడం, జాయింట్ వెంచర్లు, మరియు కమ్యూనిటీ వ్యాపార అభివృద్ధికి జీవీబీఎల్ సహకారం అందిస్తుందని తెలిపారు. ఈ సభలో జీవీబీఎల్ అధ్యక్షులు జిల్లా ప్రసాద్, ఉపాధ్యక్షులు టీ. క్రాంతి, బి. సంతోష్, టి. శివ, జి. శ్రీనివాస్, జి. నిఖిల్, కె. భరత్ కుమార్, కార్యదర్శి రవి కొండూరి, కోశాధికారి సి. తరుణ్, కార్యవర్గ సభ్యులు కె. వేణు, ఆర్. ప్రసాద్, కృష్ణ మోహన్ గుప్తా తోపాటు రాష్ట్రాల్లోని అన్ని జిల్లాల 14 చాప్టర్ల నుండి ప్రతినిధులు పాల్గొన్నారు.

## బిఎల్ఏ లు సమర్థవంతంగా పని చేయాలి

: కెఎల్ఆర్

క్షేత్రస్థాయిలో ఆగస్టు 3వరకు కష్టపడి పనిచేయాలి కేఎల్ఆర్



**మహేశ్వరం తెలంగాణ కానుక** ఓటర్ ప్రత్యేక సమగ్ర సవరణ (సర్ )ను బూత్ స్థాయిలో పని చేసి ప్రతి ఓటర్, ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫార్మ్స్ ను అందించాలని 17 మంది ఇన్చార్జులు, 4గురు అబ్జర్వర్స్ తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి. టీపీసీసీ అబ్జర్వర్ జగదీష్, సర్ నియోజకవర్గం ఇన్చార్జి దేప భాస్కర్ రెడ్డితో కలిసి తుక్కుగూడ కార్యాలయంలో మండల ఇన్చార్జులు, సర్ -- బిఎల్ఏ లు, అబ్జర్వర్స్ తో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా అబ్జర్వర్ జగదీష్ మాట్లాడుతూ... సర్ తో తప్పుల తడకలు, దొంగ ఓట్లు లేకుండా చూడాలని కోరారు. ఇన్చార్జులపై అబ్జర్వర్స్ ను పెట్టడం వల్ల ప్రతీ ఇంటికీ కాంగ్రెస్ పార్టీ నాయకత్వం వెళ్తుందని చెప్పారు. ప్రతీ ఇన్చార్జి, అబ్జర్వర్ కనీసం 25 ఇళ్లకు రోజూ వెళ్లేలా ప్లాన్ చేసుకోవాలని లక్ష్మారెడ్డి సూచించారు. ఇవాళ సాయంత్రం, రేపు, ఎల్లుండి బూత్ స్థాయి, ఇన్చార్జులతో క్షేత్రస్థాయి పర్యటన చేయాలని కిచ్చెన్నగారు అబ్జర్వర్స్ కు చెప్పారు. సీఎం సూచనలను వివరించారు.నియోజవర్గం స్థాయిలో సర్ అబ్జర్వర్స్ గా దేప భాస్కర్ రెడ్డి, అమరేందర్ రెడ్డి, పుట్టగళ్ల జగన్, బొక్క జంగారెడ్డిని నియమించారు. 17 మంది డివిజన్ అధ్యక్షులు, మరో 17 మంది అబ్జర్వర్స్, 540 మంది బూత్ స్థాయి బిఎల్ఏ లతో ఓటర్ సమగ్ర సవరణ బాధ్యతలను కో- ఆర్డినేట్ చేసుకోవాలని 98 మంది సర్ ఇన్చార్జులకు కేఎల్ఆర్ సూచించారు. ఆగస్టు 3 వరకు ఓటర్ సమగ్ర సవరణలోనే పని చేయాలని స్పష్టం చేశారు.

## క్యాన్సర్ రహిత సమాజమే లక్ష్యం

: 14-15 ఏళ్ల బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ తప్పనిసరి

?పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక టీకా పంపిణీ



**?పెబ్బేరు తెలంగాణ కానుక** గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ (సర్వైకల్ క్యాన్సర్) బారిన పడకుండా ఉండాలంటే 14 నుండి 15 సంవత్సరాల లోపు బాలికలకు హెచ్‌పీవీ ( హెచ్ పి వి ) వ్యాక్సిన్ వేయించడం తప్పనిసరి అని వైద్యులు డాక్టర్ సునీల్ కుమార్, మండల ఆరోగ్య విస్తరణ అధికారి ( ఎంఈఓ ) దామోదర్ స్పష్టం చేశారు. ?సోమవారం పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో (పీహెచ్ సి ) గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణే ధ్యేయంగా హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హులైన బాలికలకు వ్యాక్సిన్ డోసులను పంపిణీ చేశారు. "సర్వైకల్ క్యాన్సర్ నివారణలో హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఎంతో ప్రభావవంతంగా పనిచేస్తుంది. భవిష్యత్తులో వచ్చే ప్రమాదకర క్యాన్సర్ బారిన పడకుండా ఈ టీకా పూర్తి రక్షణ కల్పిస్తుంది. ఈ వ్యాక్సిన్ పెబ్బేరు పీహెచ్‌సీలో అందుబాటులో ఉంది, కాబట్టి తల్లిదండ్రులు అవగాహన పెంచుకుని తమ పిల్లలకు టీకా వేయించాలి." ?ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్లు లీలమ్మ, పార్వతి, స్వరూపరాణి, హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్, డాటా ఎంట్రీ ఆపరేటర్ రాజేష్ గౌడ్, ఫార్మా ఆఫీసర్ కుమారి, ఏఎన్ఎంలు శారద, లావణ్యలతో పాటు పలువురు ఆశా కార్యకర్తలు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంజక్షన్ ఉత్తర్వులు ఉన్నా కాంపౌండ్ వాల్ నిర్మాణం

జీహెచ్ఎంసీ, పోలీసులకు ఫిర్యాదు



**హైదరాబాద్, తెలంగాణ కానుక** సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు మండలం ముత్తంగిలో సివిల్ వివాదంలో ఉన్న భూమిలో, కోర్టు మధ్యంతర (ూాం-అ్ఠవతీఅఎ) ఇంజంక్షన్ ఉత్తర్వులు అమల్లో ఉన్నప్పటికీ కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపడుతున్నారని ఆరోపిస్తూ వాది పల్లపోతు సుబ్రమణ్యేశ్వర్ జీహెచ్ఎంసీ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్రమ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సుబ్రమణ్యేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం, ా.ా. చీశీ.187/2026లో ×.ూా. చీశీ.466/2026పై సంగారెడ్డి అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు 24-06-2026న మధ్యంతర ఇంజంక్షన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఉత్తర్వులు ప్రస్తుతం అమల్లో ఉన్నప్పటికీ, సంబంధిత వ్యక్తులు ఎలాంటి చట్టబద్ధమైన భవన లేదా కాంపౌండ్ వాల్ నిర్మాణ అనుమతులు లేకుండానే పనులు కొనసాగిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ తెల్లాపూర్ సర్కిల్ జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్‌తో పాటు పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సంబంధిత భూమి వాస్తవానికి పట్టాదారు మల్లయ్యకు చెందినదని, అనంతరం ఆయన వారసుల నుంచి తమ కుటుంబం రిజిస్టర్డ్ అమ్మకపు దస్తావేజు ద్వారా కొనుగోలు చేసిందని సుబ్రమణ్యేశ్వర్ పేర్కొన్నారు. అయితే, మల్లయ్య జీవించి ఉన్న సమయంలోనే చెల్లని పత్రాలు, ఫోర్జరీ సంతకాలను ఆధారంగా చేసుకుని నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి తమ భూమిపై హక్కులు చూపే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ అంశంపై సివిల్ కోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా, తమ స్వాధీనాన్ని పరిరక్షిస్తూ కోర్టు మధ్యంతర ఇంజంక్షన్ ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. అదేవిధంగా, జీపీఆర్ లేఅవుట్‌కు చెందిన ఓ వ్యక్తి ఈ మొత్తం వ్యవహారానికి ప్రధాన కారణమని సుబ్రమణ్యేశ్వర్ ఆరోపించారు. తమ వ్యవసాయ భూమిని కబ్జా చేయాలనే ఉద్దేశంతో, దానిని తన లేఅవుట్‌లోని ప్లాట్లలో భాగంగా చిత్రీకరిస్తూ ముందస్తు ప్రణాళికతో ఈ చర్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. కోర్టు వివాదంలో ఉన్న భూమిని లేఅవుట్‌లో భాగంగా చూపిస్తూ తమ యాజమాన్య హక్కులను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కోర్టు ఉత్తర్వులను పట్టించుకోకుండా నిర్మాణం కొనసాగించడం వల్ల వివాదం మరింత తీవ్రమై శాంతిభద్రతల సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ అధికారులు నిర్మాణ అనుమతులను పరిశీలించి, అనుమతులు లేకుండా నిర్మాణం జరుగుతున్నట్లు తేలితే వెంటనే పనులను నిలిపివేయాలని, అలాగే శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా పోలీసులు చట్టప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. న్యాయస్థానం ఉత్తర్వులకు అనుగుణంగా సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకుని అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలని కోరారు.

# రేవంత్ రెడ్డి పై మాట్లాడే స్థాయి కేటీఆర్‌కు లేదు

పదేళ్ల పాలనలో తెలంగాణను వెనక్కి నెట్టిన

బీఆర్ఎస్‌కు ప్రజలు ఇప్పటికే తీర్పు ఇచ్చారు

ఫోన్ ట్యాపింగ్‌లు, వ్యక్తిగత జీవితాల్లో జోక్యంపై బీఆర్ఎస్

సమాధానం చెప్పాలని డిమాండ్

కేసీఆర్ స్వయంగా వచ్చి మాట్లాడితేనే

రాజకీయంగా విలువ ఉంటుందని వ్యాఖ్య

టీపీసీసీ ఫిషర్మెన్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్

మెట్టు సాయికుమార్ తీవ్ర విమర్శలు



**హైదరాబాద్ తెలంగాణ కానుక** ఙబీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చేస్తున్న విమర్శలను టీపీసీసీ ఫిషర్మెన్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మెట్టు సాయికుమార్ తీవ్రంగా ఖండించారు. ప్రజల తీర్పుతో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురించి మాట్లాడే నైతిక అర్హత కేటీఆర్‌కు లేదని ఆయన అన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులు, వివాదాలు, ఆరోపణలకు సమాధానం చెప్పాల్సిన పరిస్థితిలో ఉన్న నాయకులు ఇప్పుడు ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ, పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయకుండా అనేక వివాదాలకు కేంద్రబిందువుగా మారిందన్నారు. అలాంటి పార్టీకి చెందిన నాయకులు ఇప్పుడు నీతులు, ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తోందని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి తన రాజకీయ ప్రయాణాన్ని ప్రజల మద్దతుతో నిర్మించుకున్న నాయకుడని, ప్రజల్లో తిరిగి, పోరాటాలు చేసి ముఖ్యమంత్రి స్థాయికి చేరుకున్న వ్యక్తిపై వ్యక్తిగత విమర్శలు చేయడం కేటీఆర్‌కు తగదన్నారు. రాజకీయాల్లో భిన్నాభిప్రాయాలు సహజమే అయినప్పటికీ వ్యక్తిగత స్థాయికి దిగజారి వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని సూచించారు. ఫోన్ ట్యాపింగ్‌లపై సమాధానం చెప్పాలి గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వెలుగుచూసిన ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు, వ్యక్తిగత గోప్యతకు సంబంధించిన అంశాలపై ప్రజలకు ఇప్పటికీ పూర్తి స్థాయిలో సమాధానం రాలేదని మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు. ప్రజల వ్యక్తిగత జీవితాల్లోకి తొంగిచూడడం, ప్రత్యర్థులపై నిఘా పెట్టారనే ఆరోపణలు ఎదుర్కొన్న నాయకులు ఇప్పుడు నైతిక విలువల గురించి మాట్లాడటం సరైంది కాదన్నారు. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన నాయకులు ముందుగా తమ పాలనపై వచ్చిన విమర్శలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## జాతీయ అవార్డు అందుకున్న మాజీ కౌన్సిలర్ బుడుముల యాదగిరి



**మహేశ్వరం తెలంగాణ కానుక** జల్ పల్లి 16 వార్డు మాజీ కౌన్సిలర్ బుడుమల యాదగిరి నేషనల్ జాతీయ అవార్డు అందుకున్న మాజీ కౌన్సిలర్ బుడుమాల యాదగిరి. మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం జల్ పల్లి మున్సిపాలిటీ. జల్ పల్లి గ్రామం 16 వార్డు కౌన్సిలర్ గా గత మున్సిపల్ ఎలక్షన్ లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా భారీ మెజార్టీతో గెలవడం జరిగింది గెలిచిన ఐదు సంవత్సరాలలో ప్రజలకు తన సేవలు అందించి గుర్తింపు పొందడంతో. తేదీ జూలై. 19/ 2026. రోజున నాచారం లో.బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ బెస్ట్ కౌన్సిలర్ గా జాతీయ అవార్డు అందజేశారు.

## రాజీవ్ నగర్ ఎంపీపీఎస్ ప్రాథమిక పాఠశాలలో బోనాల పండుగ.

**తెలంగాణ కానుక,తెలంగాణ కానుక** ఖానాపూర్ పట్టణంలోని



రాజీవ్ నగర్ ఎంపీపీఎస్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులతో నిర్వహించినటువంటి తెలంగాణ సంప్రదాయ బోనాల పండుగ పోతురాజుల ఊరేగింపు కార్యక్రమంలో విద్యార్థులతో కలసి పాల్గొన్న నిర్మల్ జిల్లా డిసిసి ఉపాధ్యక్షులు ఖానాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ నగర్ ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాలు పోతురాజుల ఊరేగింపు కార్యక్రమాలను తెలంగాణ సంప్రదాయ పద్ధతిలో నిర్వహించారాని విద్యార్థులను పాఠశాల యజమాన్యాన్ని అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గేయలత,రాజమణి, విజయలక్ష్మి,రామలక్ష్మి,సునీత,విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## జీడిమెట్ల పోలీస్ స్టేషన్ నూతన ఎస్‌హెచ్ఓ రవి కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపిన శశాంక్



**కుత్బుల్లాపూర్ తెలంగాణ కానుక** జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌కు నూతనంగా స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్ఓ)గా బాధ్యతలు స్వీకరించిన రవి కుమార్ ని శేషంక్ పంతులు, ఎరకల రాజు, జొన్నవాడా రాజు, శివకుమార్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా వారు రవి కుమార్ కి నూతన బాధ్యతల్లో విజయవంతంగా సేవలందించాలని ఆకాంక్షిస్తూ, ప్రజలకు సమర్థవంతమైన పోలీసింగ్ అందించాలని అభినందనలు తెలిపారు. అందుకు రవి కుమార్ కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రజల సహకారంతో శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తానని పేర్కొన్నారు.

## ది గ్రేన్ అండ్ సీడ్స్ మర్చంట్స్ అసోసియేషన్ తాండూర్.. ఆధ్వర్యంలో

వర్షాలు సమృద్ధిగా కురువాలని పూజలు

పూజలు చేసిన ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి



**తాండూర్ తెలంగాణ కానుక** ది గ్రేన్ అండ్ సీడ్స్ మర్చంట్స్ అసోసి యేషన్ తాండూర్.. ఆధ్వ ర్యంలో లోక కళ్యాణా ర్థం కోసం వర్షాలు సమృద్ధి గా పడి, పాడి పంటలు బాగా పండాలని, రైతులు సుభి క్షంగా ఉండాలని.. మహా శివుడికి జలాభిషేకం, వరుణ యాగం, పూర్ణా హుతి వైభవంగా నిర్వహిం చారు.కార్యక్రమానికి ఎమ్మె ల్యే మనోహర్ రెడ్డి, మున్సి పల్ చైర్ పర్సన్ నీరజ బాల్ రెడ్డి పలువురు కౌన్సిలర్లు, నాయకులు హాజరై పూజ లు జరిపారు. అనంతరం ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడు తూ..చెరువులు నీరు లేక వెల వెల బోతున్నాయని, బోర్లలో నీరు తగ్గడం వల్ల పంటలు ఎండిపోతు న్నాయని అన్నారు.ముఖ్యంగా ఏ ప్రాణికైనా నీళ్లే ఆధారమని, వర్షాలు బాగా కురవాలని పంటలు పండాలని దేవుడిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అన్నదానం కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ నర్సిములు, కాంగ్రెస్ నాయకులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

# కొంపల్లి లో పర్యటించిన సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజన ఐఏఎస్

**కొంపల్లి, తెలంగాణ కానుక** "ప్రతిరోజు ఒక వార్డ్" కార్యక్రమంలో భాగంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీమతి సృజన ఐఏఎస్ కొంపల్లి డివిజన్‌లోని ఎన్‌సీఎల్ కాలనీ నోబుల్ ఎన్‌క్లేవ్ ప్రాంతాలను సందర్శించారు.దఈ సందర్భంగా స్థానిక ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమైన కమిషనర్ పారిశుధ్యం, రహదారులు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా తదితర పౌర సౌకర్యాలపై సమీక్ష నిర్వహించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్‌సీఎల్ కాలనీ వాసులు డ్రైనేజీ సమస్యతో పాటు కాలనీలో నెలకొన్న ఇతర మౌలిక వసతుల సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా కొంపల్లి డివిజన్ పరిధిలోని పలు ప్రజా సమస్యలకు సంబంధించిన వినతిపత్రాన్ని కొంపల్లి మాజీ సర్పంచ్, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జెమ్మి దేవేందర్ కమిషనర్ సృజన ఐఏఎస్కు అందజేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన కమిషనర్ సంబంధిత శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బైరీ ప్రశాంత్ గౌడ్, కొంపల్లి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అధిరెడ్డి మోహన్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ లేబర్ సెల్ అధ్యక్షుడు కందాడి సుదర్శన్ రెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ లేబర్ సెల్ అధ్యక్షుడు కావలి గోపాల్ ముదిరాజ్, అంజి ముదిరాజ్, షేక్ ఇబ్రహీం, ఖదీర్, కావలి నవీన్ ముదిరాజ్, ఎన్‌సీఎల్ మరియు నోబుల్ ఎన్‌క్లేవ్ కాలనీ అసోసియేషన్ సభ్యులు సారికా రెడ్డి,



శశిధర్, నాగరాజ్, అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## అపరమేధావి డా గుగ్గిళ్ళ దివ్యమూర్తికి పీవీ నరసింహారావు ఎక్సలెన్సీ అవార్డు



**ఖమ్మం, తెలంగాణ కానుక** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం కొత్తకొత్తూరు గ్రామానికి చెందిన అపరమేధావి డాక్టర్ గుగ్గిళ్ళ దివ్యమూర్తికి పీవీ నరసింహారావు ఎక్సలెన్స్ అవార్డు లభించింది ఈ అవార్డును దివ్యమూర్తి యొక్క ప్రతిభను చూసి కళానిలయం కల్చరల్ మరియు సోషల్ ఆర్గనైజేషన్ వారు అందజేశారు ఈ అవార్డును దివ్యమూర్తి హైదరాబాదులో అబిడ్స్‌ని బొగ్గులకుంట లో గల తెలంగాణ సారస్వత పరిషత్తులో డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో రిటైర్డ్ డీఈవో నన్నపరాజు రామేశ్వరరాజు చేతుల మీదుగా అందుకున్నారు తదనంతరం ప్రముఖులు గుగ్గిళ్ల దివ్యమూర్తిని శాలువాతో ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా గుగ్గిళ్ళ దివ్యమూర్తి మాట్లాడుతూ ఈ అవార్డు రావడం మరియు సన్మానం జరగడం సంతోషంగా ఉందని ఇప్పటివరకు తనకు 78 అవార్డులు వచ్చాయని 142 వేదికల మీద సన్మానం జరిగిందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో అడ్లూరి నరసింహమూర్తి, సంస్థ అధ్యక్షులు పుష్పాలత సంస్థ సెక్రెటరీ సురేందర్ దుర్గాభవాని చందు ఆంజనేయులు రఫీ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు

## వైభవంగా శ్రీ జగదాంబిక వారాహి అమ్మవారి నవరాత్రి మహోత్సవాలు





**శేరిలింగంపల్లి తెలంగాణ కానుక** మియాపూర్ లో యలమంచి ఉదయ్ కిరణ్ దంపతులు నిర్వహించిన రాజాశ్యామల యాగం మరియు శ్రీ జగదాంబిక వారాహి అమ్మవారి నవరాత్రి మహోత్సవాల్లో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వి. జగదీశ్వర్ గౌడ్ మియాపూర్ డివిజన్ పరిధిలోని ఎస్.ఆర్. ఎస్టేట్స్ కమ్యూనిటీ హాల్‌లో గంగాధర శాస్త్రి రమాదేవి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ శ్రీ జగదాంబిక వారాహి అమ్మవారి నవరాత్రి మహోత్సవాల సందర్భంగా, మియాపూర్ యువ నాయకులు, యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ యలమంచి ఉదయ్ కిరణ్ నవ్యశ్రీ దంపతులు నిర్వహించిన రాజశ్యామల యాగం మరియు శ్రీ వారాహి అమ్మవారి ప్రత్యేక పూజా కార్యక్రమంలో శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీ వి. జగదీశ్వర్ గౌడ్ గ పాల్గొన్నారు. అనంతరం శ్రీ జగదీశ్వర్ గౌడ్ వేద పండితుల ఆశీర్వాదాలు స్వీకరించి, అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో నల్ల సంజీవ్ రెడ్డి, వీరేంద్ర గౌడ్, కృష్ణ, మన్నెపల్లి సాంబశివరావు, కేవీ రావు, రాచమల్ల కృష్ణ గౌడ్ దంపతులు, రవి కుమార్, కావూరి ప్రసాద్, రవీంద్ర రెడ్డి, అశోక్ గౌడ్, వెంకటేశ్వర్లు, బాబ్జీ, సింధూర సుధీర్, ఎం.డి. షా, కేశవరావు, సత్య రెడ్డి, మూర్తి, పద్మిని ప్రియదర్శిని, సత్యనారాయణ, సాంబయ్య, చక్రపాణి, శంకర్ చారి, రామకృష్ణ, రవి కృష్ణ, శ్రీనివాసు, సుధీర్, చిరంజీవి, రాజేష్, నరేంద్ర రెడ్డి, కామినేని వాసు, వంశీ, రత్నాచారి, శశి, సతీష్, ప్రవీణ్, సీనియర్ సిటిజన్స్ గోపీనాథ్, సుబ్బారాయుడు, బాబు, రమణ, నాయుడు, సుబ్బ రెడ్డి, మురళి, రాజు, బాలమురళి, నవీన్, రాజేశ్వరి, పద్మతో పాటు పలువురు నాయకులు, భక్తులు, స్థానిక నివాసితులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## క్రెడిట్ కోసం కమలం...

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ లో బీజేపీ బలోపేతం కావడానికి ప్రయత్నాలు ఎన్నికలకు మూడేళ్ల ముందు ప్రారంభించినట్లు కనిపిస్తుంది. ఇప్పటి వరకూ కొంత ఆలోచన చేస్తూ.. తన పార్టీ కార్యక్రమాలకే పరిమితమవుతున్న నేతలు ఇకపై రాష్ట్రాభివృద్ధిలో తమ పాత్రపైనా జనంలో చైతన్యం తెచ్చేందుకు అవసరమైన చర్యలు ప్రారంభించిందని అనుకోవాల్సి ఉంటుంది. అందుకే ఇటీవల బీజేపీ ఏపీ అధ్యక్షుడు మాధవ్ నేతృత్వంలో పోలవరం పర్యటనకు బయలుదేరి వెళ్లారరు. పోలవరం ప్రాజెక్టు పూర్తవుతున్న దశలో జాతీయ ప్రాజెక్టుకు నిధులు ఇచ్చింది కేంద్రలో అధికారంలో ఉన్న బీజేపీ అన్న విషయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నిర్ణయించారు. అందుకే తాజాగా జరిగిన పార్టీ సమావేశంలోనూ బీజేపీ ఏపీ అధ్యక్షుడు మాధవ్ కీలక వ్యాఖ్యలు రాజకీయంగా హాట్ టాపిక్ అయ్యాయి. పోలవరంపై క్రెడిట్ తీసుకోవడంలో విఫలమయ్యామని మాధవ్ అన్నారు. అమరావతికి నిధులు, సీమకు ప్రాజెక్టులు ఇచ్చినా చెప్పుకోలేకపోయామని అనడం వారు ఇకపై కేంద్ర నిధుల ప్రస్తావన పదే పదే ప్రచారం చేస్తూ పార్టీ బలోపేతానికి ప్రయత్నం చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ప్రజల ముందు తలెత్తుకుని చెప్పుకోవాల్సిన నేతలు, ఇన్నాళ్లూ మౌనంగా ఉండటం వల్ల నష్టపోయామని బీజేపీ రాష్ట్ర నేతలు గుర్తించారు. కూటమిలో ఉంటూనే రాష్ట్రాభివృద్ధిలో తమ పాత్రను తెలియ చేయాలని నిర్ణయించారు. ఎన్నికల్లో పోటీ చేయాలంటే గెలిచే శక్తి ఉండాలి . సీట్లు అడగడం ముఖ్యం కాదు గెలవగలమన్న నమ్మకం పార్టీ నాయకత్వానికి కల్పించాలి. పార్టీకి ఇప్పుడే మళ్లీ మంచి వాతావరణం ఉందని, మరో స్టెప్ ఎక్కాలని భావిస్తున్నారు. కూటమిలో కార్యకర్తలకు అన్యాయం జరిగితే పార్టీ అండగా ఉంటుందని బీజేపీ నేతలు భావిస్తున్నారు. అలాగే ఇకపై యాచించడం అంటూ ఏమీ ఉండకుండా శాసించే స్థాయికి ఎదగాలని, మనకు అవతలి వారి అవసరం ఎంత ఉందో.. దానికి రెట్టింపు అవసరం మనతో వారికీ ఉందని బీజేపీ నేతలు నేటికీ గుర్తించి ఇక కార్యాచరణకు సిద్ధమయ్యారు. అందుకే ఇక వరస సమావేశాలు నిర్వహించడమే కాకుండా కేంద్ర నాయకులను కూడా రాష్ట్రానికి రప్పించి పార్టీని బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని పార్టీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.

## గులాబీ గ్రాఫ్ పెరిగినట్టేనా

**హైదరాబాద్ :** బీఆర్ఎస్ క్రమంగా తెలంగాణ లో పుంజుకుంటుందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఎన్నికలకు ఇంకా సమయం ఉండగానే బీఆర్ఎస్ ఎఫెన్స్ లో వెళుతుంది. రేవంత్ ప్రభుత్వంపై విరుచుకుపడుతుంది. అవినీతి ఆరోపణలతో హామీలు అమలు చేయకపోవడంపై నిలదీస్తుంది. వర్గాల వారీగా విభజించుకుని వారిని సమీకరించడంలో కొంత గులాబీ పార్టీ సక్సెస్ అయినట్లు కనిపిస్తుంది. ప్రధానంగా రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులను లక్ష్యంగా చేసుకుని కారు పార్టీ హస్తానికి గురిపెట్టింది. దీంతో బీఆర్ఎస్ క్రమంగా బలం పెంచకుంటుందన్న వార్తలు అధికార పార్టీలో కలవరం రేపుతున్నాయి. ఈ విషయాన్ని సొంత పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి చెప్పారు. బీఆర్ఎస్ బలం పుంజుకుంటుందని చెప్పిన ఆమె తర్వాత మాట మార్చినప్పటికీ మీడియాలో అన్న వార్తలు ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రేణుక అన్నారని కాదు కానీ.. ప్రతి ఒక్క కాంగ్రెస్ నేత మనసులో కూడా ఇదే అభిప్రాయం ఉన్నట్లు కనపడుతుంది. కేసీఆర్ బయటకు రాకపోయినా.. ఆయనపై చేసే వ్యక్తిగత విమర్శలు కూడా ఆ పార్టీకి సానుభూతిని తెచ్చి పెడుతున్నాయంటున్నారు. దీంతో పాటు ప్రభుత్వం ఇచ్చిన హామీలపై వరసగా బీఆర్ఎస్ సమావేశాలను నిర్వహిస్తూ ప్రజలను తమ వైపునకు తిప్పుకునే ప్రయత్నం చేస్తుంది. బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావులు జనంలోకి వెళుతున్నారు. వారి పర్యటనలకు కూడా మంచి స్పందన లభిస్తుంది. ఇచ్చిన హామీలను కొన్నింటిని అమలు చేసినా, అమలు చేయని వాటిని ఫోకస్ చేయడంతో పాటు ఎరువులు కొరత, పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడం, కరువు ఇలాంటి విషయాలన్నీ తమకు అనుకూలంగా మలచుకోవడంలో బీఆర్ఎస్ సక్సెస్ అయిందనే చెప్పాలి. నిన్న జరిగిన యువ సంగ్రామ సదస్సు కూడా విజయవంతం కావడంతో పాటు కేటీఆర్ తాము అధికారంలో ఉన్నప్పుడు తప్పులు జరిగాయని, వాటిని సరిదిద్దుకుంటామని హుందాగా వ్యవహరించడం కూడా ఒకింత జనానికి చేరువ చేసిందనే చెప్పాలి. మొత్తం మీద కాంగ్రెస్ అప్రతమత్తం కాకుంటే వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావడం అంత సులువు కాదన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి

## చామకూర దారెటు..

**హైదరాబాద్ :** తెలుగు నేల రాజకీయాల్లో బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి వ్యవహారం ఎప్పటికప్పుడు హాట్ కేక్ మాదిరిగానే ఉంటోంది. ఏ పార్టీలో ఉన్నా తనదైన మార్కు రాజకీయం, తనదైన మార్కు వ్యవహారంతో మల్లారెడ్డి నిత్యం వార్తల్లోనే ఉంటారు. ప్రస్తుతం బీఆర్ఎస్ లో కొనసాగుతున్న మల్లారెడ్డి? ఆ పార్టీని వీడతారంటూ చాన్నాళ్లుగా వార్తలు వినిపిస్తూనే ఉన్నాయి. అయితే ఎప్పటికప్పుడు ఆ వాదనలను కొట్టిపారేస్తున్న సీనియర్ నేత? మళ్లీ అవే వార్తలకు బలం చేకూర్చేలా వ్యవహారం నడుపుతూ నిజంగానే వార్తల్లో నేతగా నిలుస్తున్నారు. తాజాగా మల్లారెడ్డికి చెందిన ఓ వీడియో తెగ వైరల్ అవుతోంది. ఈ వీడియోను చూస్తుంటే? ఇక మల్లారెడ్డి బీఆర్ఎస్ కు వీడ్కోలు పలికినట్టేనన్న వాదనలు ఆసక్తి రేకెత్తిస్తున్నాయి.తెలంగాణ రాజకీయాల్లో అత్యంత చర్చనీయాంశంగా మారిన ఈ వీడియోలో మల్లారెడ్డి అసలు నోరు మెదపనే లేదు. ఈ వీడియోలో కాంగ్రెస్ పార్టీ కీలక నేత, తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రసంగిస్తున్నారు. తన ప్రసంగంలో ఆయన బీఆర్ఎస్ అదినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావుపై ఓ రేంజిలో విమర్శలు గుప్పిస్తున్నారు. కేసీఆర్ పై ఆ రేంజిలో రేవంత్ విమర్శలు గుప్పిస్తూ ఉంటే?ఆయనకు వెనుక?ఆయనకు దాదాపుగా ఆనుకుని కూర్చుని ఉన్న మల్లారెడ్డి? తన ముఖంలో ఏ భావమూ కనిపించనీయకుండా అలా కూర్చుండి కనిపిస్తున్నారు..కేసీఆర్ బీఆర్ఎస్ అధినేతనే కదా. అంతేనా? టీడీపీ నుంచి బీఆర్ఎస్ లోకి రాగానే ఎమ్మెల్యే టికెట్ తో పాటుగా ఏకంగా మంత్రి పదవి ఇచ్చి? మల్లారెడ్డికి రాజకీయంగా అత్యధిక ప్రాధాన్యం కల్పించిన నేతగా కేసీఆర్ ఉన్నారు. అలాంటి కేసీఆర్ ను రేవంత్ రెడ్డి ఓ రేంజి విమర్శలు సంధిస్తూ ఉంటే? మాట మాత్రంగా కూడా స్పందించని మల్లారెడ్డి?కనీసం అక్కడి నుంచి వెళ్లిపోవాలన్న సోయి కూడా లేకుండా కూర్చుని ఉన్నారంటూ బీఆర్ఎస్ నేతలు, రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూ కేసీఆర్ ను ఆ రేంజిలో విమర్శలు గుప్పిస్తున్న వేదికపై అలా కూర్చుని ఉండిపోయిన మల్లారెడ్డి తీరు చూస్తుంటే? ఆయన గులాబీ పార్టీ నుంచి వేరు పడాలని దాదాపుగా నిర్ణయించుకున్నారన్న సరికొత్త విశ్లేషణలు రేకెత్తిస్తున్నాయి. బీఆర్ఎస్ పార్టీ అదికారం కోల్పోయిన తర్వాత అధికారం చేజిక్కించుకున్న కాంగ్రెస్ లోకో, లేదంటే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీలోనో మల్లారెడ్డి చేరిపోయే దిశగా సాగుతున్నారన్న వార్తలు నిత్యం వినిపిస్తూనే ఉన్నాయి. అంతేకాకుండా తనతో ఉప్పూనిప్పులా వ్యవహరించిన రేవంత్ రెడ్డి నేతృత్వంలో జరిగిన సమావేశంలో మల్లారెడ్డి అలా స్పందన లేకుండా కూర్చున్నారంటే.. ఆయన బీఆర్ఎస్ ను వీడి కాంగ్రెస్ లో చేరిపోవాలని నిర్ణయించుకున్నట్టేనన్న వాదనలు వినిపిస్తున్నాయి. మరి ఏం జరుగుతుందో చూడాలి.

## చిలుకూరులో మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య పంట పొలాల పరిశీలన..

**రైతులు, వ్యవసాయ కూలీలతో మాజీ ఎమ్మెల్యే భేటీ**

**సూర్యాపేట :** చిలుకూరు మండల కేంద్రంలోని పంట పొలాలను పరిశీలించిన కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ రైతులు, వ్యవసాయ కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సాగునీటి కొరతతో నాట్లతో పచ్చగా కళకళలాడాల్సిన పొలాలు బీడుగా మారే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

# ఖానాపూర్ రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్‌కు వినతి.

**,ఖానాపూర్ టౌన్ తెలంగాణ కానుక** ఖానాపూర్ పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతూ ఖానాపూర్ పట్టణ యువకులు జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం సమర్పించారు. రోడ్డు విస్తరణకు అడ్డంకిగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించేందుకు అవసరమైన నిధులను విద్యుత్ శాఖకు తక్షణమే విడుదల చేయాలని, తద్వారా ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేలా పనులను వేగవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాపెల్లి రాజు యాదవ్, కోరెండ్ల సుధీర్, గాంధారి నరేంద్రనాథ్, సుర శ్రీనివాస్, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరా నగర్ కాలనీ అభివృద్ధికి కృషి

:లక్ష్మణ్

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



**బండ్లగూడ తెలంగాణ కానుక** కాలనీ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని దన్నాడ లక్ష్మణ్ కోరారు. రాజేంద్రనగర్ సర్కిల్ 123వ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్ కాలనీలో డ్రైనేజీ నిర్మాణ పనులకు సోమవారం కాలనీ అధ్యక్షుడు దన్నాడ లక్ష్మణ్ ఆధ్వర్యంలో కాలనీ పెద్దలు శంకుస్థాపన చేశారు. డ్రైనేజీ నిర్మాణ పనులకు రూ. 12 లక్ష్యాల నిధులు మంజూరు కావడంతో కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు. నిధుల మంజూరుకు సహకరించిన అధికారులకు మాజీ ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో ఇందిరానగర్ కాలనీలో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుందని పేర్కొన్నారు. ఇందిరానగర్ కాలనీలో ని అన్ని సమస్యల పరిష్కరించడానికి రాజకీయాలకు అతీతంగా అందరం కలిసి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు దన్నాడ లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు సాయినాథ్, జనరల్ సెక్యూరిటీ నాగరాజు, ప్రచార కార్యదర్శి శివకుమార్, మహిళా ప్రతినిధి శాంతి నాయక్,దేవదయాశక అధ్యక్షుడు పి. శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ మల్లేష్, యాదగిరి,సిద్దప్ప కాలనీ పెద్దలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేర్చాలి

ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు బత్తుల సోమయ్య



**ఖమ్మం, తెలంగాణ కానుక** హైదరాబాదులో తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కేకే కమిటీ ఆహ్వానం మేరకు సోమవారం తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు బత్తుల సోమయ్య కమిటీ సభ్యులు అద్దంకి దయాకర్ ఎమ్మెల్సీ రాములు నాయక్ లను కలిసి తెలంగాణ ఉద్యమకారుల కొరకు పలు సలహాలు సూచనలు చేశారు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్క ఉద్యమకారునికి 250 గజాల ఇంటి స్థలం 25 వేల పెన్షన్ ఉచిత రైల్వే బస్సు పాసులు ఇప్పించాలని హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో ఉద్యమకారులకు ఇంటి స్థలం కేటాయించాలని ఉద్యమకారులకు ప్రత్యేకంగా హాస్పటల్ నిర్మించాలని కమిటీకి పలు సూచనలు చేశారు ఈ సందర్భంగా భక్తుల సోమయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర కల సహకారం మాత్రమే అయినదని ఇంకా తెలంగాణలో పాలనలో ఆంధ్రుల పెత్తనం కొనసాగుతున్నదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు అంగిడి బిక్షం అనంతుల మధు తునికిపాటి చారీ రాజేష్ నాయక్ కుక్కల సత్యం మీగడ రామారావు ఉల్లంగి పద్మ కలకోట అరుణ మంగీలాల్ నాయక్ రామ్మూర్తి నాయకుడు తుడుం వీరబాబు తదితరులు పాల్గొన్నారు

## గులాబీ కంచుకోటపై కాంగ్రెస్ కన్ను

**కరీంనగర్ :** తెలంగాణ రాజకీయ క్షేత్రంలో ఇప్పుడు సరికొత్త, అత్యంత వ్యూహాత్మకమైన అంతర్గత పోరాటం సాగుతోంది. నిన్నటివరకు తిరుగులేని రాజకీయ శక్తులుగా, అజేయమైన కోటలుగా వెలిగిన బీఆర్ఎస్ టాప్ లీడర్ల సొంత నియోజకవర్గాలపై అధికార కాంగ్రెస్ పార్టీ ప్రత్యేకంగా కన్నేసింది. గులాబీ దళపతి కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అడ్డా సిరిసిల్ల, ట్రబుల్ షూటర్ హరీష్ రావు కంచుకోట సిద్దిపేట నియోజకవర్గాల్లో పొలిటికల్ హీట్ అమాంతం పెరిగింది. ప్రధాన నేతలను నేరుగా ఢీకొట్టడం కంటే, వారి రాజకీయ పునాదులను కదిలించేలా ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని టార్గెట్ చేస్తూ కాంగ్రెస్ వేస్తున్న అడుగులు క్షేత్రస్థాయి రాజకీయాలను వేడెక్కిస్తున్నాయి.నిన్నటివరకు బీఆర్ఎస్ పార్టీకి వెన్నుముకగా నిలిచిన స్థానిక సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, మండల పార్టీ అధ్యక్షులను కాంగ్రెస్ స్థానిక నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు వ్యూహాత్మకంగా ఆకర్షిస్తున్నారు. ముఖ్యంగా గజ్వేల్ ? సిద్దిపేట సరిహద్దు ప్రాంతాల్లో ఈ సైలెంట్ ఆపరేషన్ అత్యంత వేగంగా విస్తరిస్తోంది. టాప్ లీడర్లు హైదరాబాద్‌లోనే ఉంటూ అసెంబ్లీ లేదా మీడియా వేదికలపై కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాడుతుంటే, క్షేత్రస్థాయిలో మాత్రం హస్తం శ్రేణులు గ్రామాల్లోని కరడుగట్టిన బీఆర్ఎస్ కార్యకర్తలను టార్గెట్ చేస్తున్నారు. గజ్వేల్ లాంటి ప్రాంతాల్లో క్యాంప్ ఆఫీసుల చుట్టూ జరుగుతున్న రాజకీయ ఘర్షణలు, నిరసనలు కేవలం పైకి కనిపిస్తున్న ఊహాగానాలు కావు, లోపల మాత్రం కాంగ్రెస్ తన పనిని నిశ్శబ్దంగా పూర్తి చేస్తోంది. పదేళ్ల కాలంలో గ్రామాల్లో పనులు చేసి బిల్లులు రాక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న మాజీ సర్పంచులు, నిధుల కొరతతో సతమతమవుతున్న ప్రజాప్రతినిధుల బలహీనతలను కాంగ్రెస్ పార్టీ క్యాష్ చేసుకుంటోంది. వారికి అధికార పార్టీ అండగా ఉంటుందనే భరోసా ఇస్తూనే, మూడు రకాల ఆకర్షణీయమైన వ్యూహాలను అమలు చేస్తోంది. త్వరలో రాబోయే నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పిస్తామని లేదంటే స్థానిక నిధుల కేటాయింపుల్లో ప్రాధాన్యత ఇస్తామని హామీలు ఇస్తోంది. దారికి రాకపోతే అధికార బలంతో స్థానిక పనులకు బ్రేకులు వేయడం లేదా సహకరించడం ద్వారా ఒత్తిడి పెంచుతోంది. బీఆర్ఎస్ అధిష్టానానికి, స్థానిక లీడర్లకు మధ్య గ్యాప్ పెంచేందుకు ప్రయత్నిస్తోంది.

# వ్యవసాయానికి పరిశ్రమల తోడ్పాటుతోనే రైతుల ఆదాయం పెరుగుతుంది

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లుఖమ్మంలో మరిన్ని అగ్రో
ఆధారిత పరిశ్రమలకు ప్రభుత్వం ప్రోత్సాహం
విలువ ఆధారిత వ్యవసాయంతో రైతులు
ఆర్థికంగా బలోపేతం కావాలి
కొణిజెర్లను పారిశ్రామిక మండలంగా తీర్చిదిద్దుతాంరాష్ట్రంలో
ఆయిల్ పామ్ సాగు 10 లక్షల ఎకరాలకు విస్తరణే లక్ష్యం
దేశంలో తొలి సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్
ప్రతి 10 వేల ఎకరాలకు ఒక
ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు లక్ష్యం
సీడ్ గార్డెన్‌తో దేశానికే ఖమ్మం కేంద్రంగా మారుతుంది
గోద్రెజ్ సమీకృత ఇంటిగ్రేటెడ్ ఆయిల్ పామ్ ప్రాసెసింగ్
ఫ్యాక్టరీని ప్రారంభించిన డిప్యూటీ సీఎం



**ఖమ్మం, తెలంగాణ కానుక** వ్యవసాయాన్ని పరిశ్రమలతో అనుసంధానం చేసి విలువ ఆధారిత ఉత్పత్తులను ప్రోత్సహించినప్పుడే రైతుల ఆదాయం స్థిరంగా పెరుగుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు.ఖమ్మం జిల్లా కొణిజెర్ల మండలం అంజనాపురంలో తెలంగాణ ప్రభుత్వ సహకారంతో నిర్మించిన గోద్రెజ్ సమీకృత (ఇంటిగ్రేటెడ్) ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క మల్లు రాష్ట్ర వ్యవసాయ సహకార మార్కెటింగ్ చేనేత జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గోద్రెజ్ ఇండస్ట్రీస్ చైర్‌పర్సన్ నాదిర్ బి గోద్రెజ్ గోద్రెజ్ అగ్రోవెట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సునీల్ కటారియా వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్ జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ సిపి సునీల్ దత్ వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ లతో కలిసి సోమవారం ఘనంగా ప్రారంభించారు.అనంతరం ఫ్యాక్టరీలోని ఉత్పత్తి విభాగాలు ఆయిల్ పామ్ గెలల ప్రాసెసింగ్ యూనిట్లు నాణ్యత నియంత్రణ వ్యవస్థను పరిశీలించి సంస్థ ప్రతినిధులతో మాట్లాడారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ ఖమ్మం జిల్లా వ్యవసాయానికి చిరునామాగా నిలిచిందన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఒకప్పుడు హెవీ వాటర్ ప్లాంట్ థర్మల్ పవర్ స్టేషన్ నవభారత్ వంటి పరిశ్రమలు ఉండేవని జిల్లా పునర్విభజన తర్వాత ప్రస్తుతం ఖమ్మం జిల్లా ప్రధానంగా వ్యవసాయంపైనే ఆధారపడుతోందన్నారు. పాలేరు జలాశయం నాగార్జునసాగర్ ఎడమ కాలువ, వైరా రిజర్వాయర్ ఈ ప్రాంత రైతాంగానికి జీవనాధారమని పేర్కొన్నారు.రైతుల ఆదాయం పెరగాలంటే సంప్రదాయ పంటలతో పాటు ఆయిల్ పామ్ వంటి అధిక ఆదాయం ఇచ్చే వాణిజ్య పంటల సాగు వైపు మళ్లడం అవసరమన్నారు. ఈ అంశాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు సమగ్రంగా వివరించారని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగు చేపట్టే రైతులకు నాలుగు సంవత్సరాల కాలంలో ఎకరాకు సుమారు రూ. 52 వేల వరకు ప్రోత్సాహకాన్ని అందిస్తోందని తెలిపారు. సూపర్ ఎల్‌నినో వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ ఆయిల్ పామ్ సాగు నిలకడైన దిగుబడిని అందిస్తుందని చెప్పారు. దేశంలో వంటనూనెల అవసరం ఎక్కువగా ఉన్నదని దేశీయ ఉత్పత్తి 12 మిలియన్ టన్నులకు మాత్రమే పరిమితమైందన్నారు. ప్రతి సంవత్సరం సుమారు 3 మిలియన్ టన్నుల వంటనూనె దిగుమతుల కోసం రూ.1.5 లక్షల కోట్ల విదేశీ మారక ద్రవ్యం వెచ్చించాల్సి వస్తోందని తెలిపారు. ఈ పరిస్థితిని మార్చేందుకు ఆయిల్ పామ్ సాగు విస్తరణ అత్యంత అవసరమని స్పష్టం చేశారు. 1991-92లో అప్పటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి హయాంలో ఈ ప్రాంతంలో ఆయిల్ పామ్ సాగుకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా సుమారు 15 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని దేశ అవసరాలకు అనుగుణంగా దానిని 70 లక్షల ఎకరాలకు విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. 2023లో టన్ను ఆయిల్ పామ్ గెలల ధర రూ.12 వేలుగా ఉండగా ప్రస్తుతం సుమారు రూ.23 వేలకు చేరడం రైతులకు ప్రయోజనకరంగా మారిందన్నారు. వంట నూనెతో పాటు సౌందర్య సాధనాల పరిశ్రమలకు అవసరమైన ముడి పదార్థాలను కూడా ఆయిల్ పామ్ ద్వారా అందించవచ్చని తెలిపారు.ఖమ్మం జిల్లాలో ఈ సమీకృత పరిశ్రమ ఏర్పాటవడం రైతులకు, యువతకు వరంగా నిలుస్తుందని పేర్కొంటూ ఈ పరిశ్రమ ఏర్పాటుకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిరంతరం కృషి చేశారని ప్రత్యేకంగా అభినందించారు. గోద్రెజ్ యాజమాన్యం, స్థానిక ఎమ్మెల్యే రాందాస్ నాయక్ అధికారులు అందరికీ అభినందనలు తెలిపారు.ఈ పరిశ్రమకు అవసరమైన రహదారి మౌళిక సదుపాయాలను టీజీఐఐసీ ద్వారా త్వరలోనే కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఖమ్మం జిల్లాలో మరిన్ని వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పడి రైతులు పండించే పంటలకు స్థానికంగానే విలువ ఆధారిత ఉత్పత్తులు తయారయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆకాంక్షించారు. దీని వల్ల రైతుల ఆదాయం పెరగడంతో పాటు స్థానిక యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. ఈ సమీకృత ప్రాజెక్టులో సీడ్ గార్డెన్ మిల్లింగ్ యూనిట్ రిఫైనరీ వంటి అన్ని సౌకర్యాలు ఒకే ప్రాంగణంలో ఏర్పాటు కావడం విశేషమన్నారు. భవిష్యత్తులో ఆయిల్ పామ్ విత్తనాల కోసం ఇండోనేషియా మలేషియా వంటి దేశాలపై ఆధారపడాల్సిన అవసరం ఉండదన్నారు. 113 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఈ సమీకృత పరిశ్రమ గంటకు 60 నుంచి 120 టన్నుల గెలలను ప్రాసెస్ చేసే సామర్థ్యాన్ని కలిగి ఉందని తెలిపారు. గోద్రెజ్ సంస్థ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని, మిర్చి, పత్తి, వరి ఆధారిత పరిశ్రమలను కూడా రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని సంస్థను కోరారు.రైతులు వాణిజ్య పంటలు, విలువ ఆధారిత వ్యవసాయంపై దృష్టి సారించాలని పిలుపు నిచ్చారు. రాష్ట్ర స్థూల ఆర్థికోత్పత్తి (+ూణ్యా) సుమారు రూ.17 లక్షల కోట్లు ఉండగా వ్యవసాయ రంగం వాటా కేవలం 15 శాతం మాత్రమే ఉండటం రైతుల ఆర్థిక పరిస్థితిని సూచిస్తోందన్నారు. రైతుల ఆదాయం పెరగాలంటే వాణిజ్య పంటలు, విలువ ఆధారిత పరిశ్రమలే శాశ్వత పరిష్కారమని పేర్కొన్నారు.ఇటీవల తొమ్మిది రోజుల్లో రైతుల ఖాతాల్లో రూ.9 వేల కోట్ల పెట్టుబడి సాయం జమ చేశామని తెలిపారు. నాగార్జునసాగర్, కృష్ణా జలాలు సీతారామ ఎత్తిపోతల పథకం పాలేరు లింక్ ఎన్కూరు--రాజీవ్ లింక్ కాలువల ద్వారా లభించే నీటిని వినియోగించుకొని ఖమ్మం జిల్లాలో ఉద్యాన పంటల సాగును మరింత విస్తరించాలని సూచించారు.కొణిజెర్ల మండలం భవిష్యత్తులో రాష్ట్రం లోనే ప్రముఖ పారిశ్రామిక మండలంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఇక్కడ ఏర్పాటు చేస్తున్న సీడ్ గార్డెన్ ద్వారా దేశవ్యాప్తంగా రైతులకు నాణ్యమైన ఆయిల్ పామ్ విత్తనాలు అందించే స్థాయికి ఈ కేంద్రం ఎదగాలని అన్నారు. సూపర్ ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ పంటలపై ప్రతి గ్రామంలో రైతులతో చర్చలు నిర్వహించి అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు.మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా గోద్రెజ్ సంస్థ ఆయిల్ పామ్ గెలల కొనుగోలు లో రైతులకు భాగస్వామిగా నిలుస్తోందని తెలిపారు. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణలో ఆయిల్ పామ్ ఆధారిత పరిశ్రమలను అభివృద్ధి చేసే అవకాశాలు మరింత విస్తరించాయని దేశంలోనే ఆయిల్ పామ్ హబ్‌గా తెలంగాణను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.ఒకప్పుడు ఉమ్మడి ఖమ్మం జిల్లాకే పరిమితమైన ఆయిల్ పామ్ సాగు నేడు రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు విస్తరించిందని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 3 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని రానున్న 2 నుంచి 3 సంవత్సరాల్లో దానిని 10 లక్షల ఎకరాలకు పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. దేశం వంటనూనెల్లో స్వయం సమృద్ధి సాధించాలంటే సుమారు 70 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు అవసరమని చెప్పారు. ప్రస్తుతం దేశంలోని ఆయిల్ పామ్ సాగులో దాదాపు 90 శాతం తెలుగు రాష్ట్రాల నుంచే జరుగుతోందన్నారు. తెలంగాణలో ఇప్పటి వరకు మూడు ఆయిల్ పామ్ ఫ్యాక్టరీలు పనిచేస్తుండగా గోద్రెజ్ ఏర్పాటు చేసిన ఈ పరిశ్రమ నాలుగో ఫ్యాక్టరీ అని తెలిపారు.దేశంలో ఇప్పటి వరకు ఆయిల్ పామ్‌కు ప్రత్యేక సీడ్ గార్డెన్ లేకపోవడం గమనార్హమని గోద్రెజ్ సంస్థ మలేషియా భాగస్వామ్యంతో ఖమ్మంలో దేశంలోనే తొలి ఆధునిక సీడ్ గార్డెన్‌ను ఏర్పాటు చేస్తోందని చెప్పారు. సీడ్ గార్డెన్‌తో పాటు పరిశోధన కేంద్రం రైతులకు అవగాహన కల్పించే ప్రదర్శన విభాగాలు శిక్షణా కార్యక్రమాలు నాణ్యమైన నర్సరీల ఏర్పాటు వంటి కార్యక్రమాలకు కూడా నేటి నుంచే శ్రీకారం చుడుతున్నామని తెలిపారు.ఈ సమీకృత ఆయిల్ పామ్ కేంద్రం రైతులకు అన్ని విధాలా ఉపయోగపడు తుందని మంత్రి పేర్కొన్నారు. రైతుల సందేహాల నివృత్తిఏశాస్త్రీయ సాగుపై మార్గదర్శకాలు నాణ్యమైన మొక్కలు వ్యవసాయ పరికరాలు ఎరువులు పురుగు మందులు అవసరమైన సాంకేతిక సేవలు ఒకే కేంద్రంలో అందుబాటులో ఉంటాయని తెలిపారు. రైతులు శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపడితే ఎకరాకు 15 నుంచి 16 టన్నుల వరకు ఆయిల్ పామ్ గెలల దిగుబడి సాధించవచ్చని చెప్పారు. రాష్ట్రంలో త్వరలోనే మరో ఆరు ఆయిల్ పామ్ ఫ్యాక్టరీలను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.ప్రస్తుతం నెలకొన్న సూపర్ ఎల్‌నినో పరిస్థితుల్లో పంటల వైవిధ్యీకరణ అత్యంత అవసరమని పేర్కొన్నారు. పసిఫిక్ మహా సముద్రంలో ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల దక్షిణ భారతదేశంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఉన్నాయని ఇలాంటి పరిస్థితుల్లో ఆయిల్ పామ్ ఉద్యాన పంటలు రైతులకు స్థిరమైన ఆదాయాన్ని అందించే ఉత్తమ ప్రత్యామ్నాయమని వివరించారు.ఆయిల్ పామ్ రైతులు ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెందుతున్నారని ఆయిల్ పామ్ సాగు చేస్తున్న అనేక మంది రైతుల కుటుంబాలు ఆర్థికంగా స్థిరపడి, వారిపిల్లలు విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించే స్థాయికి ఎదిగారని అన్నారు. ఇతర ఏ పంటతోనూ పోల్చలేనంత ఆదాయం ఆయిల్ పామ్ ద్వారా లభిస్తుందని పేర్కొన్నారు. తాను కూడా ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతునేనని గుర్తు చేశారు. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలను ప్రోత్సహించడం రాష్ట్ర ప్రభుత్వ విధానమని తెలిపారు. ఏ జిల్లాలోనైనా 10 వేల ఎకరాలకు పైగా ఆయిల్ పామ్ సాగు ఉంటే అక్కడే ప్రాసెసింగ్ పరిశ్రమ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఆయిల్ పామ్ రైతుల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధరను పెంచాలని అలాగే దిగుమతులపై సుంకాలు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతోందన్నారు.ఆయిల్ పామ్ తోటల్లో కంది పత్తి పప్పు ధాన్యాలు వంటి అంతర పంటలను విజయవంతంగా సాగు చేయవచ్చని చెప్పారు. తద్వారా రైతులకు ప్రారంభ సంవత్సరాల్లోనే అదనపు ఆదాయం లభిస్తుందని వివరించారు. ఖమ్మం జిల్లా దేశానికే స్ఫూర్తిగా నిలుస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఇలాంటి పరిశ్రమల ఏర్పాటు ద్వారా రైతులకు మెరుగైన ఆదాయం, యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. గోద్రెజ్ సంస్థ మరో పరిశ్రమను కూడా ఖమ్మంలో ఏర్పాటు చేయాలనుకుంటే అవసరమైన భూమిని కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఆయిల్ పామ్ సాగు విస్తరణతో పాటు వ్యవసాయ ఆధారిత పరిశ్రమల అభివృద్ధే తెలంగాణ రైతుల ఆర్థికాభివృద్ధికి బాటలు వేస్తుందని ఖమ్మం జిల్లా దేశంలోనే ఆయిల్ పామ్ రంగానికి ఆదర్శంగా నిలుస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆశాభావం వ్యక్తం చేశారు.వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది డిసెంబర్‌లో తెలంగాణ రైజింగ్--2047 విజన్ డాక్యుమెంట్ ను విడుదల చేసిందని తెలిపారు. ఆ విజన్‌కు అనుగుణంగా వ్యవసాయ రంగ అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ రూపొందించామని, ప్రస్తుతం సుమారు 40 బిలియన్ డాలర్లుగా ఉన్న వ్యవసాయ రంగ ఆర్థిక విలువను 2047 నాటికి 400 బిలియన్ డాలర్లకు పెంచడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 3.36 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని గత మూడు సంవత్సరాల్లోనే 2 లక్షల ఎకరాల కొత్త విస్తీర్ణం ఆయిల్ పామ్ సాగులోకి రావడం దేశంలోనే అత్యధికమని తెలిపారు. గోద్రెజ్ సంస్థకు ఖమ్మం జిల్లాలో 113ఎకరాల భూమిని కేటాయించి అవసరమైన అన్ని అనుమతులను వేగవంతంగా మంజూరు చేయడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో దేశంలోనే తొలి సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్ ను ఏర్పాటు చేయడం సాధ్యమైందన్నారు. గోద్రెజ్ ఇండస్ట్రీస్ చైర్మెన్ నాదిర్ బి. గోద్రెజ్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. దేశం వంటనూనెల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించడం జాతీయ లక్ష్యమని ఆ లక్ష్య సాధనలో తెలంగాణ ప్రభుత్వం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఆయిల్ పామ్ సాగు విస్తరణలో మహిళలు మరింత చురుకుగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రైతు కుటుంబాల్లో మహిళల భాగస్వామ్యం పెరిగితే ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం మరింత పెరిగి దేశం వంటనూనెల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించే లక్ష్యం వేగంగా నెరవేరుతుందని పేర్కొన్నారు.గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సునీల్ కటారియా మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా గోద్రెజ్ సంస్థ దేశ వ్యాప్తంగా ఆయిల్ పామ్ రంగంలో పని చేస్తోందన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా వేల హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తూ దేశంలోని ప్రముఖ ఆయిల్ పామ్ సంస్థల్లో ఒకటిగా గోద్రెజ్ ఎదిగిందని తెలిపారు. భారత్ ఇప్పటికీ వంటనూనెల అవసరాల కోసం విదేశీ దిగుమతులపై ఆధారపడుతోందని దేశీయ ఉత్పత్తిని పెంచేందుకు ఆయిల్ పామ్ సాగు విస్తరణ అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఈ దిశగా తెలంగాణ రాష్ట్రం దేశంలోనే వేగంగా ఎదుగుతున్న రాష్ట్రంగా నిలిచిందని కొనియాడారు. తెలంగాణ ప్రభుత్వ సహకారంతో ఖమ్మం జిల్లాలో తొలి సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్ ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇదే ప్రాంగణంలో త్వరలోనే ఎడిబుల్ ఆయిల్ రిఫైనరీని కూడా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సమీకృత ప్రాజెక్టు ద్వారా 700 మందికి పైగా ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు.నాణ్యమైన ఆయిల్ పామ్ మొక్కల ఉత్పత్తి కోసం ఖమ్మంలోనే సీడ్ గార్డెన్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రైతులకు మెరుగైన నాణ్యత గల నాట్లను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ఆయిల్ పామ్ సాగు మరింత విస్తరించేందుకు సంస్థ కృషి చేస్తుందని చెప్పారు.వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ అంజనాపురంలో సమీకృత ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు నాయకత్వంలో రైతులు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. గత 30 సంవత్సరా లుగా ఈ ప్రాంతంలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని రైతులు కోరుకుంటూ వచ్చారని తెలిపారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఫ్యాక్టరీ నిర్మాణ పనులు ప్రారంభమై, నేడు పూర్తై ప్రారంభోత్సవం జరగడం ఈ ప్రాంత ప్రజల కల సాకారమైన రోజుగా అభివర్ణించారు. గోద్రెజ్ సంస్థ ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడుతూ ఫ్యాక్టరీలో ఉద్యోగాల భర్తీలో స్థానిక యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ ప్రాంత యువత ప్రతిభావంతులు నైపుణ్యం కలిగిన వారని వారికి ఎక్కువగా ఉపాధి అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా సుడా చైర్‌పర్సన్ దుర్గా ప్రసాద్ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మెన్ రాయల నాగేశ్వరరావు వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సర్పంచ్ లు గోద్రెజ్ సంస్థ ప్రతినిధులు ప్రజాప్రతినిధులు అధికారులు ఆయిల్ పామ్ రైతులు పెద్ద సంఖ్యలో ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అధిష్టానం ఎంట్రీతో ఈటెల, బండి మధ్య గ్యాప్ తగ్గినట్టేనా

**హైదరాబాద్ :** తెలంగాణ భారతీయ జనతా పార్టీలో గత కొంతకాలంగా సాగుతున్న అంతర్గత విభేదాలకు చెక్ పెట్టేందుకు అధిష్టానం ప్రయత్నాలు షురూ చేసింది. రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పెట్టుకున్న ఢిల్లీ పెద్దలు, ఇక్కడి కీలక నేతల మధ్య ఉన్న కోల్డ్ వార్‌ను ముగించడానికి నేరుగా రంగంలోకి దిగారు. ఇందులో భాగంగానే పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్, ఎమ్మెల్యే అభయ్ పాటిల్ ఆధ్వర్యంలో బుజ్జగింపుల పర్వం ఊపందుకుంది. రాష్ట్ర బీజేపీలో అత్యంత కీలక నేతలుగా ఉన్న కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ మధ్య సయోధ్య కుదిర్చేందుకు హైకమాండ్ గట్టి ప్రయత్నాలే చేస్తోందిఈ వివాదాన్ని వీలైనంత త్వరగా సమసిపోయేలా చూడాలనే పట్టుదలతో అధిష్టానం ఉంది. ఇందులో భాగంగానే శుక్రవారం రాత్రి ఈటల రాజేందర్ నివాసానికి వెళ్లిన అభయ్ పాటిల్, రాత్రి పొద్దుపోయే వరకు ఆయనతో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. పార్టీ అంతర్గత పరిణామాలు, విభేదాలకు గల కారణాలపై ఆయనతో ఆరా తీశారు. అనంతరం బండి సంజయ్‌తో కూడా అభయ్ పాటిల్ భేటీ అయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.ఈ క్రమంలోనే ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ నివాసంలో ఒక కీలకమైన భేటీ జరగనుంది. ఈ మీటింగ్‌కు ఈటల రాజేందర్, బండి సంజయ్ ఇద్దరూ హాజరుకానుండటం విశేషం. అధిష్టానం దూతలుగా వచ్చిన సునీల్ బన్సల్, అభయ్ పాటిల్ సమక్షంలో ఈ ఇద్దరు నేతలను ఒకే వేదికపైకి తెచ్చి, వారి మధ్య ఉన్న మనస్పర్థలను తొలగించడానికి లక్ష్మణ్ నివాసం వేదిక కాబోతోంది.కొంతకాలంగా ఈటల రాజేందర్, బండి సంజయ్ మధ్య సఖ్యత లోపించిన విషయం బహిరంగ రహస్యమే. ఒకరిపై మరొకరు పరోక్షంగా పలుమార్లు విమర్శలు, ఆరోపణలు గుప్పించుకున్నారు. ఈ ఇద్దరు నేతల మధ్య ఉన్న గ్యాప్ చూసి వారి అనుచరులు, అభిమానులు మరింత రెచ్చిపోయారు. పలు సందర్భాల్లో పరస్పర వ్యతిరేక పోస్టర్లు, ఫ్లెక్సీలు కూడా వెలిశాయి. ఈ అంతర్గత విభేదాలు క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్‌ను తీవ్ర గందరగోళానికి గురిచేశాయి. ఈ ప్రభావం పార్టీ బలోపేతంపై పడుతుండటంతో ఢిల్లీ పెద్దలు అలర్ట్ అయ్యారు.ఇటీవల తెలంగాణలో పర్యటించిన జాతీయ నేతలు నితిన్ నబీన్, జేపీ నడ్డా సైతం రాష్ట్ర నేతలకు స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. వ్యక్తిగత విభేదాలను పక్కన పెట్టి, పార్టీ ప్రయోజనాలే పరమావధిగా పనిచేయాలని కరాఖండిగా చెప్పారు. అయినప్పటికీ ఆశించిన స్థాయిలో మార్పు రాకపోవడంతో, ఇప్పుడు నేరుగా హైకమాండ్ రాయబారాన్ని పంపింది. తెలంగాణలో అధికారమే పరమావధిగా భావిస్తున్న బీజేపీకి ఈ ఇద్దరు నేతలూ అత్యంత అవసరం. బండి సంజయ్ మాస్ లీడర్‌షిప్, కేడర్‌లో ఉన్న ఫాలోయింగ్ పార్టీకి ఎంత ప్లస్సో.. ఈటల రాజేందర్ రాజకీయ అనుభవం, వ్యూహాలు అంతే ముఖ్యం. వీరిలో ఏ ఒక్కరిని వదులుకోవడానికి లేదా దూరం పెట్టడానికి అధిష్టానం సిద్ధంగా లేదు. ఇద్దరి బలాలు కలిస్తేనే తెలంగాణలో అనుకున్న లక్ష్యాన్ని సాధించగలమని ఢిల్లీ పెద్దలు బలంగా నమ్ముతున్నారు.అధిష్టానం నేరుగా రంగంలోకి దిగడం, ఇవాళ ఎంపీ లక్ష్మణ్ నివాసంలో ఇద్దరు కీలక నేతలు ముఖాముఖి కూర్చోనుండటంతో ఈ భేటీపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ చర్చల తర్వాతైనా ఇద్దరు నేతలు తమ పంతాలను వీడి, పార్టీ కోసం కలిసి నడుస్తారని సాధారణ కార్యకర్తలు, క్యాడర్ ఆశగా ఎదురుచూస్తున్నారు. మరి ఢిల్లీ పెద్దల బుజ్జగింపులు ఎంతవరకు పారుతాయో, టీ బీజేపీలో ఈ అంతర్గత సంక్షోభానికి తెరపడుతుందో లేదో చూడాలి.

## గులాబీ గ్రాఫ్ పెరిగినట్టేనా


**హైదరాబాద్ :** బీఆర్ఎస్ క్రమంగా తెలంగాణ లో పుంజుకుంటుందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఎన్నికలకు ఇంకా సమయం ఉండగానే బీఆర్ఎస్ ఎఫెన్స్ లో వెళుతుంది. రేవంత్ ప్రభుత్వంపై విరుచుకుపడుతుంది. అవినీతి ఆరోపణలతో హామీలు అమలు చేయకపోవడంపై నిలదీస్తుంది. వర్గాల వారీగా విభజించుకుని వారిని సమీకరించడంలో కొంత గులాబీ పార్టీ సక్సెస్ అయినట్లు కనిపిస్తుంది. ప్రధానంగా రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులను లక్ష్యంగా చేసుకుని కారు పార్టీ హస్తానికి గురిపెట్టింది. దీంతో బీఆర్ఎస్ క్రమంగా బలం పెంచకుంటుందన్న వార్తలు అధికార పార్టీలో కలవరం రేపుతున్నాయి. ఈ విషయాన్ని సొంత పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి చెప్పారు. బీఆర్ఎస్ బలం పుంజుకుంటుందని చెప్పిన ఆమె తర్వాత మాట మార్చినప్పటికీ మీడియాలో అన్న వార్తలు ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రేణుక అన్నారని కాదు కానీ.. ప్రతి ఒక్క కాంగ్రెస్ నేత మనసులో కూడా ఇదే అభిప్రాయం ఉన్నట్లు కనపడుతుంది. కేసీఆర్ బయటకు రాకపోయినా.. ఆయనపై చేసే వ్యక్తిగత విమర్శలు కూడా ఆ పార్టీకి సానుభూతిని తెచ్చి పెడుతున్నాయంటున్నారు. దీంతో పాటు ప్రభుత్వం ఇచ్చిన హామీలపై వరసగా బీఆర్ఎస్ సమావేశాలను నిర్వహిస్తూ ప్రజలను తమ వైపునకు తిప్పుకునే ప్రయత్నం చేస్తుంది. బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావులు జనంలోకి వెళుతున్నారు. వారి పర్యటనలకు కూడా మంచి స్పందన లభిస్తుంది. ఇచ్చిన హామీలను కొన్నింటిని అమలు చేసినా, అమలు చేయని వాటిని ఫోకస్ చేయడంతో పాటు ఎరువులు కొరత, పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడం, కరువు ఇలాంటి విషయాలన్నీ తమకు అనుకూలంగా మలచుకోవడంలో బీఆర్ఎస్ సక్సెస్ అయిందనే చెప్పాలి.

## చామకూర దారెటు..

**హైదరాబాద్ :** తెలుగు నేల రాజకీయాల్లో బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి వ్యవహారం ఎప్పటికప్పుడు హాట్ కేక్ మాదిరిగానే ఉంటోంది. ఏ పార్టీలో ఉన్నా తనదైన మార్కు రాజకీయం, తనదైన మార్కు వ్యవహారంతో మల్లారెడ్డి నిత్యం వార్తల్లోనే ఉంటారు. ప్రస్తుతం బీఆర్ఎస్ లో కొనసాగుతున్న మల్లారెడ్డి? ఆ పార్టీని వీడతారంటూ చాన్నాళ్లుగా వార్తలు వినిపిస్తూనే ఉన్నాయి. అయితే ఎప్పటికప్పుడు ఆ వాదనలను కొట్టిపారేస్తున్న సీనియర్ నేత? మళ్లీ అవే వార్తలకు బలం చేకూర్చేలా వ్యవహారం నడుపుతూ నిజంగానే వార్తల్లో నేతగా నిలుస్తున్నారు. తాజాగా మల్లారెడ్డికి చెందిన ఓ వీడియో తెగ వైరల్ అవుతోంది. ఈ వీడియోను చూస్తుంటే? ఇక మల్లారెడ్డి బీఆర్ఎస్ కు వీడ్కోలు పలికినట్టేనన్న వాదనలు ఆసక్తి రేకెత్తిస్తున్నాయి.తెలంగాణ రాజకీయాల్లో అత్యంత చర్చనీయాంశంగా మారిన ఈ వీడియోలో మల్లారెడ్డి అసలు నోరు మెదపనే లేదు. ఈ వీడియోలో కాంగ్రెస్ పార్టీ కీలక నేత, తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రసంగిస్తున్నారు. తన ప్రసంగంలో ఆయన బీఆర్ఎస్ అదినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావుపై ఓ రేంజిలో విమర్శలు గుప్పిస్తున్నారు.

# బిజినెస్

## ఎల్‌టీసీజీ పన్నును ఎత్తివేయం




**న్యూఢిల్లీ :** ఈక్విటీల్లో పెట్టుబడుల ప్రవాహాన్ని పెంచడంలో భాగంగా దీర్ఘకాలిక మూలధన లాభాలపై పన్ను(ఎల్‌టీసీజీ)ను పూర్తిగా తొలగించాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్న ప్రస్తుత తరుణంలో కేంద్ర ప్రభుత్వం షాకిచ్చింది. ఎల్‌టీసీజీ ట్యాక్స్‌ను పూర్తిగా రద్దు చేసే అంశంపై ప్రస్తుతం ఎలాంటి ప్రతిపాదన లేదని స్పష్టం చేసింది. ఈ విషయాన్ని పార్లమెంట్‌కు కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరీ సమాచారం ఇచ్చారు. 2024-25 మదింపు సంవత్సరంలో రూ. 72,249 కోట్లుగా వసూలైన ఎల్‌టీపీజీ ట్యాక్స్.. ఆ తర్వాతి సంవత్సరంలో 78 శాతం ఎగబాకి రూ.1.29 లక్షల కోట్లకు చేరుకున్నది. సాధారణంగా షేర్లు లేదా మ్యూచువల్ ఫండ్స్‌ను దేశీయ, రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి 12 నెలల కంటే ఎక్కువకాలం పాటు హోల్డ్ చేస్తే వాటిని లాంగ్‌టర్మ్ అసెట్స్‌గా పరిగణిస్తారు. వీటిపై 12.5 శాతం ఎల్‌టీసీజీ పన్నును వసూలు చేస్తారు.

## కుప్పకూలిన బ్లూచిప్ షేర్లు.. తీవ్ర అమ్మకాల ఒత్తిడితో 443 పాయింట్లు పతనమైన సెన్సెక్స్



**ముంబై, జూలై 20:** దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టాల్లో ముగిశాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 442.93 పాయింట్లు లేదా 0.57 శాతం కోల్పోయి 77,708.52 వద్ద స్థిరపడింది. ఒకానొక దశలో 783.16 పాయింట్లు పడిపోవడం గమనార్హం. కాగా, భారీ సంస్థల షేర్లను మదుపర్లు పెద్ద ఎత్తున అమ్మేశారు. ఈ క్రమంలోనే యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ల షేర్ విలువలు అత్యధికంగా 5.48 శాతం, 5.12 శాతం చొప్పున దిగజారాయి. ఇటీవలి త్రైమాసిక ఆర్థిక ఫలితాలు నిరుత్సాహకరంగా ఉండటమే కారణమని మార్కెట్ విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 95.80 పాయింట్లు లేదా 0.39 శాతం క్షీణించి 24,238.50 వద్ద నిలిచింది.

# అమెరికా, ఇరాన్ ఉద్రిక్తతలు..
# క్రూడ్ ఆయిల్ ధరలకు రెక్కలు

అమెరికా-ఇరాన్ మధ్య మళ్లీ ఉద్రిక్తతలు పెరగడంతో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలకు ఒక్కసారిగా రెక్కలు వచ్చాయి. సోమవారం బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 90 డాలర్ల మార్క్‌ను దాటింది. హర్మూజ్ జలసంధి (ౕౕథ్రీఖ శీట ఎశీతీఎబఓ) మీదుగా చమురు సరఫరాలకు అంతరాయం కలుగవచ్చనే ఆందోళనతో మార్కెట్లలో కొనుగోళ్లు పెరిగాయి. దాంతో గత రెండు రోజులుగా చమురు ధరలు వరుసగా ఎగబాకుతున్నాయి. సోమవారం బ్రెంట్ క్రూడ్ ధర దాదాపు మూడు శాతం పెరిగి బ్యారెల్‌కు 90 డాలర్లు దాటింది. అంతకుముందు ట్రేడింగ్ సెషన్‌లో కూడా ఇదే స్థాయిలో పెరుగుదల నమోదైంది. అమెరికా వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (డబ్ల్యూటీఐ) క్రూడ్ కూడా 3.5 శాతానికి పైగా పెరిగి బ్యారెల్‌కు 85.39 డాలర్ల వద్ద ట్రేడైంది. దేశీయంగా మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్) లో ఆగస్టు క్రూడ్ ఫ్యూచర్స్ ధరలు కూడా జోరందుకున్నాయి.

ఉదయం ట్రేడింగ్‌లో బ్యారెల్‌కు రూ.210 పెరిగి రూ.8,120 ఇంట్రాడే గరిష్ఠస్థాయికి చేరాయి. అంతర్జాతీయ మార్కెట్ల ప్రభావమే దేశీయ ధరలపైనా కనిపించింది. వారాంతంలో అమెరికా, ఇరాన్ మధ్య సైనిక చర్యలు మరింత తీవ్రం కావడం మార్కెట్లను కలవరపరిచింది. ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో లేదని టెహ్రాన్ ప్రకటించడం పరిస్థితిని మరింత ఉద్రిక్తం చేసింది. వరుసగా తొమ్మిదో రోజు ఇరాన్‌లోని లక్ష్యాలపై దాడులు నిర్వహించినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. వాణిజ్య నౌకలు, పౌర నౌకలపై దాడులకు తెగబడుతున్న




ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని బలహీనపర్చడమే తమ లక్ష్యమని తెలిపింది. మరోవైపు హర్మూజ్ జలసంధిలో నాలుగు నౌకలను అడ్డుకున్నట్లు ఇరాన్ నౌకాదళం వెల్లడించింది. వాటిలో రెండు ప్రమాదాలకు గురికాగా, మరో రెండు వెనక్కి వెళ్లిపోయినట్లు సమాచారం. ప్రస్తుత పరిస్థితుల్లో ముడిచమురు ధరలు సమీప కాలంలో బలంగానే కొనసాగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలు కొనసాగితే ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు.

# విస్తరణ బాటలో రఘువంశీ..
# రూ 400 కోట్లు సమీకరించిన హైదరాబాదీ కంపెనీ

**హైదరాబాద్ :** హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఏరోస్పేస్, డిఫెన్స్ రంగ సంస్థ రఘువంశీ ఏరోస్పేస్ గ్రూప్ (ఆర్‌వీఏజీ) తన విస్తరణ ప్రణాళికలకు ఊతమిస్తూ 40 మిలియన్ డాలర్లు (సుమారు రూ.400 కోట్లు) సమీకరించింది. దీనికి నార్వెస్ట్, స్కైగెన్ అసెట్ మేనేజ్‌మెంట్ నేతృత్వం వహించగా.. ఇండస్ బ్రిడ్జి వెంచర్స్, జీజేఎన్‌ఎక్స్ వెంచర్స్, ప్రముఖ పెట్టుబడిదారు ఆశిష్ కచోలియా పెట్టుబడులు పెట్టారు. ఈ నిధులను భారత్, యూకే, అమెరికాలోని తయారీ కేంద్రాల విస్తరణకు వినియోగించనున్నట్టు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వంశీ వికాస్ వెల్లడించారు. అలాగే హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలోని హార్డ్‌వేర్ పార్‌లో నిర్మిస్తున్న సమగ్ర తయారీ క్యాంపస్, మిషన్ సిస్టమ్స్, డీప్-టెక్ అండ్ అటానమస్ సిస్టమ్స్ వ్యాపారాల అభివృద్ధికి ఈ పెట్టుబడులు ఉపయోగపడనున్నాయని చెప్పారు. దాదాపు రెండు దశాబ్దాలు గా కార్యకలాపాలు నిర్వహిస్తున్న రఘు వంశీ ఏరోస్పేస్ గ్రూప్.. ప్రస్తుతం 3 దేశాల్లో 10కిపైగా తయారీ యూనిట్లు, 1,200 మందికిపైగా ఉద్యోగులతో కార్యకలాపాలు సాగిస్తోంది. ప్రస్తుతం ఈ సంస్థ వద్ద రూ.2,500 కోట్లకు పైగా ఆర్డర్ బుక్ ఉన్నది. హార్డ్‌వేర్ పార్ ప్రాజెక్టును వేగవంతం చేసి, స్వదేశీ మిషన్ సిస్టమ్స్, అటానమస్ సిస్టమ్స్ అభివృద్ధిపై మరింత దృష్టి సారిస్తామని ఎండీ వంశీ వికాస్ తెలిపారు. సంస్థ సీఈవో శివ అరవింద్ మాట్లాడుతూ.. తమ సంస్థ ఐఐటీలు, ట్రిపుల్‌ఐటీలు, ఏఆర్‌సీఐ, డీఆర్‌డీఓ, ఏడీఏ వంటి ప్రముఖ




విద్యా, పరిశోధనా, రక్షణ సంస్థలతో భాగస్వామ్యాలు కొనసాగిస్తూ స్వదేశీ ఏరోస్పేస్ సాంకేతికతల అభివృద్ధికి కృషి చేస్తోందని వెల్లడించారు

# స్పెయిన్‌దే ప్రపంచ కప్..
# ఫైనల్లో మెస్సీసేనకు నిరాశ

ప్రపంచ ఫుట్‌బాల్‌లో సరికొత్త అధ్యాయం మొదలైంది. అర్జెంటీనాను మట్టికరిపిస్తూ రెండోసారి ఫిఫా వరల్డ్‌కప్‌లో గెలిచిన స్పెయిన్ సాకర్‌లో అద్వితీయ శక్తిగా మారింది. స్పెయిన్ పేరు చెప్పగానే ఆ దేశంలోని అందమైన ప్రదేశాలతో పాటు శక్తికి, ధైర్యానికి, పోరాటానికి ప్రతీకగా నిలిచే స్పానిష్ బుల్ గుర్తొస్తుంది. ఫిఫా ప్రపంచకప్‌లో స్పెయిన్ జట్టులోని ప్రతీ ఆటగాడు ఒక్కో బుల్‌లా మారారు. ఎదురైన ప్రతీ ప్రత్యర్థిని ఢీకొంటూ, చివరకు ప్రపంచకప్‌ను తమ ఖాతాలో వేసుకున్నారు. ఫైనల్లో ఆ జట్టు లియోనెల్ మెస్సీతో కూడిన అర్జెంటీనాతో తలపడటంతో అందరూ మరోసారి మెస్సీసేననే ఫేవరెట్‌గా భావించారు. కానీ మైదానంలో కనిపించింది మాత్రం భిన్నమైన దృశ్యం. 120 నిమిషాల పాటు అర్జెంటీనా ఒక్కసారి కూడా గోల్‌పోస్ట్‌ను లక్ష్యంగా చేసుకుని షాట్ కొట్టలేకపోయింది. మెస్సీకి బంతి అందిన ప్రతిసారి ముగ్గురు, నలుగురు స్పానిష్ ప్లేయర్లు చుట్టుముట్టారు. ఫైనల్లో రోడ్రి కెప్టెన్సీలోని స్పెయిన్ ఆట చూశాక ఆ జట్టు అందుకున్నది కప్పు మాత్రమే కాదు.. ప్రపంచ ఫుట్‌బాల్‌నే తన గుప్పిట్లోకి తీసుకుందని చెప్పొచ్చు.

### టికి-టాకా టు టోటల్ ఫుట్‌బాల్ దాకా

దశాబ్ద కాలంగా స్పెయిన్ ఫుట్‌బాల్ అంటే చిన్న పాస్‌లతో బంతిని ఆధీనంలో ఉంచుకునే 'టికి-టాకా' స్టైల్ మాత్రమే గుర్తుకొచ్చేది. 2010లో ఈ వ్యూహంతోనే ఆ జట్టు ప్రపంచకప్ గెలిచింది. కానీ, ఇప్పుడు స్పెయిన్ టీమ్‌లో మరో కోణం చేరింది. ప్రస్తుత కోచ్ లూయిస్ డి లా ఫ్యూయెంటె సాంప్రదాయ పాసింగ్ గేమ్‌కు వేగం, దూకుడును జోడించాడు. అవకాశం దొరికితే నేరుగా దాడి చేయడం.. బంతి కోల్పోతే వెంటనే తమ కంట్రోల్‌లోకి తెచ్చుకోవడం కొత్త స్పెయిన్ తీరు. వేగం, తెలివి, క్రమశిక్షణ.. ఈ మూడు కలిసి 'లా రోజా' టీమ్‌ను ప్రపంచంలోనే కంప్లీట్ టీమ్‌గా మార్చాయి.

యువ సంచలనం లామిన్ యమాల్ మెరుపు వేగంతో దూసుకెళ్తే... ఇంకో స్ట్రయికర్ నికో విలియమ్స్ ప్రత్యర్థి రక్షణను చీల్చాడు. పెడ్రి, రుయిజ్ ఆటకు అందాన్ని జోడించారు. కెప్టెన్ రోడ్రి వీటన్నింటికీ కేంద్రబిందువుగా నిలిచాడు. ఇక, ప్రత్యర్థి ఆడే విధానాన్ని మార్చేయడమే స్పెయిన్ అసలైన బలం. టెక్నికల్, టాక్టికల్ ప్లానింగ్‌తో ప్రతి క్షణాన్ని తన ఆధీనంలో ఉంచుకున్న రోడ్రిసేన తుదిపోరులో



మెస్సీ నేతృత్వంలోని అర్జెంటీనా ఎటాకింగ్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసింది. దాంతో టోర్నీలో ఆడిన ప్రతి మ్యాచ్‌లోనూ కనీసం రెండేసి గోల్స్ చేసిన మెస్సీసేన.. ఫైనల్లో మాత్రం ఒక్కసారైనా స్పెయిన్ గోల్ పోస్ట్‌పైకి వెళ్లే సాహసం చేయలేకపోయింది.

### నాడి తెలిసిన గురువు

2022 ప్రపంచకప్ తర్వాత లూయిస్ డి లా ఫ్యుయెంటెను స్పానిష్ టీమ్ హెడ్ కోచ్‌గా నియమించినప్పుడు చాలామంది ఆశ్చర్యపోయారు. ఎందుకంటే ఫ్యుయెంటెకు పెద్ద క్లబ్‌లకు కోచ్‌గా పనిచేసిన అనుభవం లేదు. వరల్డ్ ఫుట్‌బాల్‌లో తనకు పెద్దగా పేరూ లేదు. కానీ స్పెయిన్ ఫుట్‌బాల్ వ్యవస్థపై అతనికి పూర్తి అవగాహన ఉంది. యూత్ జట్లతో పనిచేసిన అనుభవం ఉంది. ప్రస్తుత జాతీయ జట్టులోని ఆటగాళ్లలో చాలామందిని చిన్నప్పటి నుంచే తీర్చిదిద్దాడు. అదే అతడి బలంగా మారింది. 'మన ఆటను మార్చొద్దు... పరిస్థితులు ఎలా ఉన్నా ఆశలు కోల్పోవద్దు' అనే బలమైన సందేశంతో జట్టును ప్రపంచ చాంపియన్‌గా నిలబెట్టాడు.

### ఐదేండ్లలో 16 అంతర్జాతీయ టైటిళ్లు

ఈ ప్రపంచకప్ విజయం ఒక్కసారిగా రాలేదు. గత కొన్నేళ్లుగా స్పెయిన్ పురుషుల ఆటలోనే కాకుండా. మహిళల ఫుట్‌బాల్‌లోనూ ప్రపంచాన్ని ఏలుతోంది. యూరోలు.. నేషన్స్ లీగ్‌లు.. ఒలింపిక్స్.. యూత్ ప్రపంచకప్‌లు ఇలా అన్నింటా స్పెయిన్ బుల్స్ ఆధిపత్యమే నడుస్తోంది. గత ఐదేండ్లలో అండర్-17 నుంచి సీనియర్ స్థాయి వరకు స్పానిష్ టీమ్ ఏకంగా 16 అంతర్జాతీయ టైటిళ్లను కైవసం చేసుకోవడం విశేషం. పురుషుల జట్టు వరుసగా 38 మ్యాచ్‌ల్లో ఓటమి ఎరుగకుండా దూసుకెళ్తూ ఫుట్‌బాల్ చరిత్రలోనే సుదీర్ఘ అజేయ రికార్డును నెలకొల్పింది.

### జట్టే అసలైన స్టార్


అర్జెంటీనాకు మెస్సీ.. ఫ్రాన్స్‌కు ఎంబాపె, ఇంగ్లండ్‌కు హ్యారీకేన్, బ్రెజిల్‌కు నెయ్‌మార్, నార్వేకు హాలండ్.. ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతీ జట్టులో ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన ఓ సూపర్ స్టార్ ఉన్నాడు. కానీ, స్పెయిన్ టీమ్‌లో మాత్రం అలాంటి ఒకే ఒక్క సూపర్ స్టార్ లేడు. కానీ 11 మంది స్టార్లున్నారు. ఒక్కరు తప్పు చేస్తే ఇంకొకరు కప్పిపుచ్చారు. ఒక్కరు అలసిపోతే మరొకరు పరుగులు తీశారు. ఒక్కరు గోల్ చేస్తే అంతా సంబరపడ్డారు. వ్యక్తుల కంటే జట్టే గొప్పదని స్పెయిన్ ప్రపంచానికి నిరూపించింది.

### ఫైనల్ ముగిశాక ఫైటింగ్

ఫైనల్లో ఓడి తీవ్ర నిరాశకు గురైన అర్జెంటీనాకు మిడ్‌ఫీల్డర్ లియాండ్రో పరెడెస్ దుందుడుకు ప్రవర్తన మరింత చెడ్డపేరు తీసుకొచ్చింది. ఆట ముగిసిన వెంటనే అతడు ప్రత్యర్థి ఆటగాళ్లతో గొడవకు దిగడమే ఇందుకు కారణం. ఆట ఆఖరి విజిల్ మోగాక సంబురాలు చేసుకుంటున్న స్పెయిన్ ప్లేయర్ల వద్దకు వెళ్లిన అతడు పలువురు ఆటగాళ్లను లక్ష్యంగా చేసుకుని వారిపై దాడి చేశాడు. ముందు స్పెయిన్ డిఫెండర్ ఎరిక్ గార్సియా వద్దకు వెళ్లి అతడిని తోసేశాడు. అనంతరం గార్సియాకు మద్దతుగా వచ్చిన సహచరుడు గావిని సైతం రెండుసార్లు కిందపడేసి అతడిపై కోపంతో ఊగిపోయాడు. అర్జెంటీనా కోచ్ స్కలోని సహా ఇతర ఆటగాళ్లు పరెడెస్‌ను అడ్డుకున్నా వినకుండా స్పెయిన్ ప్లేయర్లపై మళ్లీ దాడి చేసేందుకు యత్నించాడు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అయింది.

# స్పోర్ట్స్

## ఆ మసాలా ఉంటేనే మజా..
## రిటైర్మెంట్ పుకార్లపై రోహిత్ వ్యాఖ్యలు





**లండన్:** ఇంగ్లండ్‌తో రెండు వన్డేల్లో విఫలమైన వేళ తనపై వచ్చిన రిటైర్మెంట్ పుకార్లకు చెక్ పెడుతూ లార్డ్స్‌లో సత్తాచాటిన రోహిత్ శర్మ.. మూడో వన్డే అనంతరం వాటిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'దేశానికి ప్రాతినిథ్యం వహించడం, బ్యాట్‌తో జట్టుకు ఉపయోగపడేలా ఆడటమే నా పని. నా కెరీర్ ఆరంభం నుంచీ అదే చేస్తున్నా. వాటి (రిటైర్మెంట్, ఫామ్ లేమిపై వస్తున్న విమర్శలు) గురించి చాలాకాలంగా వింటున్నా. నేను ఆడుతున్నంత కాలం అవి ఉంటాయి. అవి నా ఆటను ప్రభావితం చేయలేవు. ఫీల్డ్‌లో ఆడి జట్టును గెలిపించడమే నా పని. నా దృష్టి అంతా దానిమీదే ఉంటుంది. అయినా ఇలాంటి మసాలా లేకుంటే ఆటలో మజా ఉండదు' అని హిట్‌మ్యాన్ పేర్కొన్నాడు. లార్డ్స్‌లో సెంచరీ పట్ల సంతోషం వ్యక్తం చేసిన రోహిత్.. జట్టు ఓడిపోవడం నిరాశ కల్గించిందని అన్నాడు.

## ఆల్ ఇంగ్లండ్ జూనియర్ చాంపియన్ సాయి నచికేత్




తెలంగాణ యువ షట్లర్ సాయి నచికేత్ భట్రాజు భారత బ్యాడ్మింటన్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ జూనియర్ చాంపియన్‌షిప్‌లో మెన్స్ అండర్19 టైటిల్ సొంతం చేసుకున్న దేశ తొలి ఆటగాడిగా నిలిచాడు. మెగా టోర్నీలో అద్భుత ప్రదర్శన చేసిన టాప్ సీడ్ నచికేత్ ఫైనల్లో 21-8, 21-15తో వరుస సెట్లలో భారత్‌కే చెందిన సుహాస్‌ను చిత్తు చేసి టైటిల్ గెలిచాడు.





## ప్రభాస్ ఫౌజీ.. రెబల్ స్టార్ పవర్‌ఫుల్ రోల్..!

రెబల్ స్టార్ ప్రభాస్ నటిస్తోన్న పాన్ ఇండియా చిత్రం ఫౌజీ. ఈ మూవీకి హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ మూవీకి సంబంధించిన క్రేజీ అప్‌డేట్ వచ్చేసింది. ఇందులో ప్రభాస్ ఆజాద్ హింద్ ఫౌజ్ సైనికుడిగా కనిపించనున్నారని తెలుస్తోంది. నేతాజీ సుభాష్ చంద్రబోస్ నాయకత్వంలో భారత స్వాతంత్ర్యం కోసం ఆయన చేసే పోరాటమే ప్రధానంగా తెరకెక్కించనున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో ప్రభాస్ ముందుగా బ్రిటీష్ ఇండియన్ ఆర్మీలో సైనికుడిగా పనిచేసి.. ఆ తర్వాత సుభాష్ చంద్రబోస్ నేతృత్వంలోని ఆజాద్ హింద్ ఫౌజ్‌లో చేరుతాడని తెలుస్తోంది. ఇది కేవలం నేతాజీ బయోపిక్ మాత్రమే కాదని.. అంతే కాకుండా ఇండియన్ ఫ్రీడమ్ కోసం పోరాడిన సైనికుల కథను చూపించే చిత్రంగా ఉండనుందని టాక్. ఈ మూవీలో ప్రభాస్ పాత్ర ధైర్య సాహసాలు, త్యాగం, దేశభక్తితో నిండి ఉంటుందని సమాచారం. అయితే దీనిపై ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటనైతే రాలేదు. ఈ చిత్రాన్ని డిసెంబరు 3న ఫౌజీ విడుదల కానుందని తాజాగా పోస్టర్‌ను పంచుకుంది. ఈ పోస్టర్‌లో ఎప్పుడు చూడని లుక్‌లో ప్రభాస్ కనిపించారు. దీంతో అభిమానుల్లో అంచనాలు పెంచేసింది. ఈ చిత్రంలో ప్రభాస్ సరసన ఇమాన్వి హీరోయిన్‌గా కనిపించనుంది. ఈ చిత్రంలో మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్, జయప్రద కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ భారీ యాక్షన్ మూవీ డిసెంబర్ 3న థియేటర్లలో సందడి చేయనుంది. కాగా.. ప్రభాస్ ఫౌజీతో పాటు సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో నటిస్తున్నారు. వీరిద్దరి కాంబోలో స్పిరిట్ చిత్రంలో కనిపించనున్నారు. ఈ మూవీలో త్రిప్తి దిమ్రీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఆ తర్వాత సలార్: పార్ట్ 2, కల్కి 2898 ఏడీ: పార్ట్ 2 సినిమాలు చేస్తున్నారు.

# 10 రోజుల్లో అక్కినేని అఖిల్ 'లెనిన్' రికార్డు వసూళ్లు

టాలీవుడ్ యాక్టర్ అక్కినేని అఖిల్ టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం 'లెనిన్'. మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వం వహించిన ఈ మూవీలో మిస్టర్ బచ్చన్ ఫేం భాగ్య శ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించింది. జులై 10న గ్రాండ్‌గా విడుదలైన ఈ చిత్రం నిర్మాతలకు కాసుల వర్షం కురిపిస్తూ అఖిల్ కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. లెనిన్ 10 రోజుల సక్సెస్‌ఫుల్ థియాట్రికల్ రన్‌లో వరల్డ్ వైడ్‌గా రూ.88 కోట్లు సాధించింది. ఈ విషయాన్ని మేకర్స్ అఫీషియల్‌గా అనౌన్స్ చేశారు.

ఈ అరుదైన సందర్భాన్ని పురస్కరించుకుని ఇవాళ సాయంత్రం లెనిన్ టీం హైదరాబాద్‌లో సక్సెస్ మీట్ ఏర్పాటు చేయనుంది. ఈవెంట్‌కు అక్కినేని నాగచైతన్య చీఫ్ గెస్ట్‌గా రాబోతున్నాడు. ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన తర్వాత ఈ మూవీని అన్నపూర్ణ స్టూడియోస్‌తోపాటు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, నాగ వంశీ సంయుక్తంగా నిర్మించారు. రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా వచ్చిన ఈ చిత్రంలో శివాజీ, సునీల్ కీ రోల్స్‌లో నటించారు. ఈశ్వరీరావ్, బ్రహ్మాజీ, ప్రమోద్ పంజు కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి ఎస్ థమన్ మ్యూజిక్ అందించాడు. లెనిన్ థియాట్రికల్ రన్ తర్వాత జీ5 ఓటీటీ ప్లాట్‌ఫాంలో ప్రీమియర్ కానుంది. అంతేకాదు జీ తెలుగు, జీ సినిమాలులో టెలివిజన్ ప్రీమియర్ కానుంది






## అర్థం చేసుకోకుండా కామెంట్స్ చేస్తారు..

### నెట్టింట నెగెటివిటీపై రకుల్ ప్రీత్ సింగ్

తెలుగు, తమిళం, హిందీ ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని యాక్టర్ రకుల్ ప్రీత్ సింగ్. పక్కా ప్రొఫెషనల్‌గా ఉండే ఈ భామ అప్పుడప్పుడు నెటిజన్లు, అభిమానులతో తన అభిప్రాయాలను షేర్ చేసుకుంటుంది. తాజాగా సోషల్ మీడియాలో పెరుగుతున్న నెగెటివిటీ గురించి మాట్లాడింది. సోషల్ మీడియా అనేది కొందరు జనాలు ముక్కుమొఖం తెలియని అకౌంట్లతో తరచూ కఠిన వ్యాఖ్యలు చేస్తూ నెగెటివిటీని ప్రచారం చేసే హబ్‌లాంటిది. చాలా మంది వ్యక్తులు అజ్ఞాత ప్రొఫైల్స్‌తో స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తుంటారు. వారు చేస్తున్నకామెంట్ల ప్రభావం ఎలా ఉంటుందో కనీసం అర్థం చేసుకోరని చెప్పింది. అందరినీ మెప్పించడం అసాధ్యమన్న రకుల్ ప్రీత్ సింగ్ సెలబ్రిటీలు ఆన్‌లైన్‌లో వచ్చే అనవసరమైన ట్రోల్స్, విమర్శల వల్ల తమ ఫోకస్ మార్చుకోకూడదు. నెగెటివిటీని ఎదుర్కొనేందుకు వాటిని పట్టించుకోకుండా వ్యక్తిగత, వృత్తి పరమైన లక్ష్యాలపైన దృష్టి పెట్టడమే ఉత్తమ మార్గమని చెప్పుకొచ్చింది. ఇండియన్ 2 సినిమాతో తెలుగు ప్రేక్షకుల ముందుకొచ్చిన రకుల్ ప్రీత్ సింగ్.. స్ట్రెయిట్ తెలుగు సినిమా చేయక చాలా కాలమే అవుతుంది. ప్రస్తుతం రణ్ బీర్ కపూర్ నటిస్తోన్న రామాయణలో కీలక పాత్రలో నటిస్తోంది. రకుల్ నటించిన౹ాఫ్‌ఆ౹ాఫ్‌అఱ ూబతీ ఔశీష్ట్ర ఇశీ ప్రస్తుతం ఓటీటీ ప్లాట్‌ఫాం నెట్‌ఫ్లిక్స్‌లో ట్రెండింగ్ అవుతోంది. ఈ భామ నెక్ట్స్ ఇండియన్ 3 చేయాల్సి ఉంది. మరి తెలుగు సినిమాలో ఎప్పుడు కనిపిస్తుందో చూడాలి.

## అల్లు అర్జున్ 'రాకా' టీంలోకి మరో భామ.. ఇంతకీ పాత్ర ఏంటో మరి..?

టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబోలో 'రాకా' సినిమా వస్తుందని తెలిసిందే. సైన్స్ ఫిక్షన్, యాక్షన్ ఎలిమెంట్స్‌తో వస్తోన్న ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ ప్రాజెక్టులో ఇప్పటికే మలయాళ నటి ఫెమినా జార్జ్, పంజాబీ నటి నైలా గ్రేవల్ భాగమైనట్టు క్రేజీ అప్‌డేట్స్ వచ్చాయని తెలిసిందే. తాజాగా మరో ఆసక్తికర నెట్టింట వైరల్ అవుతోంది. తెలుగు నటి సిరి హన్మంతు 'రాకా' చిత్రంలో జాయిన్ అయింది. రీసెంట్‌గా జరిగిన ఓ ఈవెంట్‌లో నిర్మాత ఎస్‌కేఎన్ ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించారు. సిరి హన్మంతు చివరగా సీతాపయనంలో మెరవగా.. త్వరలో విడుదల కానున్న ' చెన్నై లవ్ స్టోరీ' లో కూడా సందడి చేయనుంది. ఈ నేపథ్యంలో ఇంతకీ సిరి హన్మంతు రాకా మూవీలో ఎలాంటి పాత్రలో కనిపించబోతున్నది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం ముంబైలో షూటింగ్ కొనసాగుతోంది. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా వస్తోన్న ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ తెరకెక్కిస్తోంది. ఈ మూవీని 2027 చివరలో విడుదల చేయనున్నారు. ఈ చిత్రానికి సాయి అభ్యాంకర్ మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు.



## 'కొరియన్ కనకరాజు' కొత్త సాంగ్ రిలీజ్

మెగాహీరోల్లో వరుణ్ తేజ్ ఒకడు. ముకుంద, ఫిదా, తొలిప్రేమ, కంచె లాంటి సినిమాలతో కెరీర్ ప్రారంభంలో సమ్‌థింగ్ డిఫరెంట్ అనిపించుకున్నాడు. తర్వాత నుంచి వరసపెట్టి ఫ్లాప్స్ పడ్డాయి. 2019లో వచ్చిన 'గద్దలకొండ గణేశ్' ఓ మాదిరిగా ఆకట్టుకోగా.. తర్వాత వచ్చిన గని, గాంఢీవదారి అర్జున, ఆపరేషన్ వాలంటైన్, మాట్కా చిత్రాలు ఒకదానిని మించి మరొకటి డిజాస్టర్స్ అయ్యాయి. దీంతో రెండేళ్ల గ్యాప్ తర్వాత వరుణ్ తేజ్ నుంచి వస్తున్న సినిమా 'కొరియన్ కనకరాజు'. వచ్చే నెల 7న థియేటర్లలో రిలీజ్ కానుంది. వారం క్రితం టీజర్ రిలీజ్ చేయగా పర్లేదనిపించుకుంది. ఈ క్రమంలోనే ఇప్పుడు 'రసగుమ్మడి' అంటూ ఓ పాట వదిలారు. విలేజ్ స్టైల్లో సాగే మాస్ బీట్‌తో ఉన్న ఈ గీతం కలర్‌ఫుల్‌గా బాగుంది. తమన్ మ్యూజిక్ వినసొంపుగా ఉంది. ఇకపోతే ఈ చిత్రానికి మేర్లపాక గాంధీ దర్శకుడు. రితికా నాయక్ హీరోయిన్.



Printed, Published and owned by Vakiti Ramesh, Printed Mani Raghava Printers #A-20, Vambay Colony, Hyderguda, Rajendra Nagar, Ranga Reddy Dist, Telangana. Published H.No.2-1-108/1, 2nd Floor, Upper pally, Rajendra Nagar, Ranga Reddy Dist.TG-48, Editor Vakiti Jyothi, Cell : 8008887362, RNI NO:TELTEL/2023/85625, Email-telanganakanukatelugudaily.com